


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 67 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా ఆదివారం 18 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 67 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST SUN 18 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## నేడు దావోస్‌కు సీఎం చంద్రబాబు...

### నాలుగు రోజుల పాటు ఫుల్ బిజీ!

- ప్రపంచ ఆర్థిక సదస్సులో పారిశ్రామిక దిగ్గజాలతో చర్చలు
- ఐబీఎం, గూగుల్, మేర్స్క్ సీఈఓలతో కీలక సమావేశాలు
- 4 రోజుల పర్యటనలో 36 కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం
- తొలిరోజు 20 దేశాల ఎన్నార్టీలతో డయాస్పోరా సమావేశం

- మిగతా 2లో...

# చరిత్ర తిరగరాయటం తెలుగువాళ్లతోనే సాధ్యం

- కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన
- 2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్
- 2027 జూన్ నాటికి గ్రీన్ అమోనియా ఉత్పత్తి ప్రారంభం అవుతుందని వెల్లడి
- గ్రీన్ ఎనర్జీలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామని ఉద్ఘాటన










**పెన్ పవర్ డెస్క్:** చరిత్రను తిరగరాయడం తెలుగువాళ్లకే సాధ్యమని, ప్రపంచ గతిని మార్చే శక్తిసామర్థ్యాలు మనవారికి ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ సత్తాను చాటేలా, ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు కాకినాడ వేదిక కావడం తెలుగువారందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఏఎమ్ గ్రీన్ ఆధ్వర్యంలో కాకినాడలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి చంద్రబాబు ఇవాళ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుతో ఇకపై ప్రపంచం మొత్తం కాకినాడ వైపు చూస్తుందని, భవిష్యత్ ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "గతంలో ఇదే ప్రాంతంలో నాగార్జునా ఫెర్టిలైజర్స్ గ్రే అమోనియా తయారు చేస్తే, ఇప్పుడు అదే చోట పర్యావరణహితమైన గ్రీన్ అమోనియా ఉత్పత్తి కాబోతోంది. ఇది మార్పునకు సంకేతం. చరిత్రను తిరగరాయడం అంటే ఇదే. తెలుగువాళ్లు తలచుకుంటే ఏదైనా సాధించగలరు. గత ఏడాది ఈ ప్రాజెక్టుకు అనుమతిస్తే, సరిగ్గా ఏడాది తిరిగేసరికి పనులు ప్రారంభించడం మన పనితీరుకు నిదర్శనం.

వివరాలు 2లో..



## బీహార్‌లో గెలిచాం.. బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది

- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమత ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న నరేంద్ర మోదీ
- కేంద్రం ఇస్తున్న నిధులను మమతా బెనర్జీ కొల్లగొడుతోందని విమర్శ

**పెన్ పవర్ డెస్క్:** బీహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక పశ్చిమ బెంగాల్‌కు సమయం ఆసన్నమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. బెంగాల్ పర్యటనలో భాగంగా మాల్దాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను మమతా బెనర్జీ ప్రభుత్వం కొల్లగొడుతోందని మోదీ ఆరోపించారు. తృణమూల్

- మిగతా 2లో...

## యుద్ధం ముగియలేదు... ఇప్పుడే ప్రారంభమైంది



- ఈ గెలుపు ద్వారా తమను నిర్వీర్యం చేశామని బీజేపీ నేతలు భావిస్తున్నారన్న థాకరే
- బీజేపీ కుట్రలను త్వరలో బయటపెడతామని వ్యాఖ్య
- ముంబైలో శివసేన నుంచి మేయర్‌ను నియమించాలనేది తమ కల అన్న థాకరే

వివరాలు 2లో..

## 11 సీట్లకే పరిమితమైనా మీ 'తాచుపాము' బుద్ధి మారలేదు

- ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ విషం చిమ్ముతోందని మంత్రి పార్థసారథి విమర్శ
- నాడు అసెంబ్లీలో జై కొట్టి, అధికారంలోకి వచ్చాక జగన్ మాట మార్చారని ఆరోపణ
- సొంత ప్యాలెస్‌లకు వేల కోట్లు ఖర్చుపెట్టారని, రాజధానికి మాత్రం అడ్డుపడుతున్నారని ఫైర్
- అమరావతి పనులు వేగవంతం చేశాం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే కూటమి లక్ష్యమని స్పష్టీకరణ




**పెన్ పవర్ డెస్క్:** "2024 ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురై కేవలం 11 సీట్లకే పరిమితమైనా వైసీపీ నేతల 'తాచుపాము' బుద్ధి మారకపోవడం రాష్ట్ర దౌర్భాగ్యం" అని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధిపై, ముఖ్యంగా ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ విషప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేయడమే లక్ష్యంగా వైసీపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. "హెల్దీ-హ్యాపీ-వెల్తీ స్టేట్ అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంటే, రాష్ట్రంలో కనిపిస్తున్న ఆశాజనక వాతావరణాన్ని దెబ్బతీయడమే వైసీపీ పనిగా పెట్టుకుంది. ఒకప్పుడు ఇదే అసెంబ్లీలో అమరావతికి మనస్ఫూర్తిగా

- మిగతా 2లో...



## గోరంట్ల మాధవ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ

- అత్యాచార ఘటనకు సంబంధించి వివరాలను వెల్లడించారనే కేసు
- గతంలోనే పోక్సో చట్టం కింద కేసు నమోదు
- కోర్టు విచారణలకు హాజరుకాని గోరంట్ల మాధవ్

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు న్యాయపరంగా తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. ఆయనపై విజయవాడలోని పోక్సో ప్రత్యేక కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటనకు సంబంధించిన సున్నితమైన వివరాలను బహిరంగంగా వెల్లడించారనే ఆరోపణలతో గోరంట్ల మాధవ్‌పై గతంలోనే పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ ఫిర్యాదును మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఇచ్చారు. ఈ కేసు విచారణకు రావాలంటూ కోర్టు పలుమార్లు నోటీసులు

- మిగతా 2లో...



## బంగ్లాదేశ్‌లో దారుణం.. మరో హిందువు దారుణ హత్య

- పెట్రోల్ పోయించుకుని డబ్బులు ఇవ్వకుండానే వెళ్లే ప్రయత్నం చేసిన నిందితుడు
- కారును ఆపే ప్రయత్నం చేసిన హిందూ ఉద్యోగి రిపోన్ సాహా
- కారుతో ఢీకొట్టి హత్య చేసిన బీఎన్‌పీ మాజీ నాయకుడు

- మిగతా 2లో...



### కత్తులతో దాడి చేసుకున్న టీడీపీ, వైసీపీ కార్యకర్తలు..

## టీడీపీ కార్యకర్త మృతి

- కాకినాడ జిల్లా అల్లిపూడి గ్రామంలో ఉద్రిక్తత
- దాడిలో నలుగురికి తీవ్ర గాయాలు
- గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేసిన పోలీసులు

- మిగతా 2లో...




## చైనా స్కూలులో నోరో వైరస్ కలకలం..

### వంద మందికి పైగా సోకిన వైరస్

- గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ లోని స్కూలులో 103 మంది విద్యార్థులకు నోరో వైరస్
- అప్రమత్తమైన అధికారులు.. స్కూలు చుట్టుపక్కల వైద్య పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడి
- స్కూలు మొత్తం వైరస్ ను నాశనం చేసే మందులు స్ప్రే చేసిన అధికారులు

2లో...




## పశ్చిమబెంగాల్ దిశానిర్దేశకుడు జ్యోతిబసు

మార్క్సిస్టు యోధుడు, సీపీఐ(ఎం) ఆవిర్భావ నాయకులు, ప్రజా, కార్మిక పక్షపాతి జ్యోతిబసు. నాడు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి గా జ్యోతిబసు లెఫ్ట్ ఫ్రంట్ పాలన రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చివేసిన విషయం దేశమంతా తెలిసిందే. కరువు రాష్ట్రంగా కునారిల్లిన పశ్చిమబెంగాల్‌ను అన్నపూర్ణగా మార్చింది.అణగారిన వర్గాలకు ఇరవై ఐదు లక్షల ఎకరాలను పంచి (భూ సంస్కరణలు చేపట్టి) దేశంలోనే కాదు, ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచింది. కష్టజీవులకు, కార్మిక వర్గానికి అండదండలిచ్చింది. అంతర్జాతీయ సౌహార్ధతకు దిక్సూచిగా నిలిచింది. అలాగే ఎల్ఐసి పరిరక్షణకు పూర్తి బాసటగా నిలిచింది.దీనివల్ల,బీమా ఉద్యోగుల పోరాటాలు విజయవంతమయ్యాయి. ”ఇలాకో విజిలు పేరుతో ఆటోమేషన్ (కంప్యూటరీకరణ)కి వ్యతిరేకంగా ఏఐఐఇఏ, జరిపిన పోరాటంలో జ్యోతిబసు లెఫ్ట్‌ఫ్రంట్ శ్రేణులు నిర్వర్తించిన మహత్తరమైన పాత్రను ఎల్ఐసి ఉద్యోగులు ఎవరూ మర్చిపోలేరు. బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన ఉన్న సందర్భంగా ఎలాగైనా సూపర్ కంప్యూటర్‌ను ఇన్‌స్టాల్ చేయాలనే ప్రభుత్వ, యాజమాన్య ప్రయత్నాలు ఫలించలేదు.1968 దసరా సెలవుల్లో కంప్యూటర్‌ను ఇలాకో భవనంలో పెట్టాలని ప్రయత్నాలు, ఊహాగానాలు మొదలయ్యాయి. దీంతో పెద్దఎత్తున ఇలాకో విజిల్ కొనసాగింపు జరిగింది. ఇలాకో భవనం దగ్గర కాళీమాత విగ్రహం పెట్టి దసరా పండగ నిర్వహించారు. జ్యోతిబసు, ఇతర కమ్యూనిస్టు యోధులు, ఇతర రాజకీయ నాయకులు, జాతిన్ చక్రవర్తి, జ్యోతిర్మయి బసుతో బాటు అనేక మంది ఈ విజిల్‌లో పాల్గొన్నారు. 24 పరగణా జిల్లాలోని గిరిజనులు(వీరికి గతంలో కరువు సందర్భంగా అంబలి ఇచ్చి ఎఐఐఈఏ యూనిట్లు వారిని ఆదుకున్నాయి)తమ విల్లంబులతో వచ్చి ఈ విజిల్‌లో పాల్గొన్నారు.24 గంటలూ, 365 రోజుల పాటు ఈ ఉద్యమం కొనసాగింది.

ప్రభుత్వ అంచనాలు తలకిందులె యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచింది.అప్పటి హోంమంత్రి జ్యోతిబసు ఇలాకో భవనంలో కంప్యూటర్ పెట్టడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని చెప్పారు. చివరకు ఫోర్ట్ విలియమ్స్‌లో మిలిటరీ రక్షణలో ఉన్న కంప్యూటర్‌ను పశ్చిమబెంగాల్ నుండి వెనక్కు తరలించారు. కంప్యూటరీకరణ వ్యతిరేక ఉద్యమం చరిత్రాత్మక విజయం సాధించింది.ఆటోమేషన్ వ్యతిరేక ఉద్యమంలో భారత కార్మిక వర్గానికి దశను, దిశను నిర్దేశిస్తూ ఏఐఐఇఏ సాగించిన ఈ ఉద్యమంలో జ్యోతిబసు ఆధ్వర్యంలో వామపక్ష పార్టీలు అనేక మంది జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులను, మేధావులు భాగస్వాములయ్యారు.కంప్యూటర్ పరిజ్ఞానం మన దేశంలో ప్రాథమిక దశలో ఉన్న నేపథ్యంలో బీమా ఉద్యోగులు ఈ ఉద్యమాన్ని చేపట్టింది. ఇండియన్ ఆయిల్ కంపెనీలో కంప్యూటరీకరణ విజయవంతంగా చేయగలిగిన ప్రభుత్వం ఎల్ఐసిలో ఓటమి చూడవలసి వచ్చింది. ఒక కంప్యూటర్ వస్తే దాదాపు 24వేల ఉద్యోగాలు ఎలా పోతాయో ఉద్యోగులు అర్థం చేసుకోగలిగారు. వారిని ఈ పోరాటం జాగృతం చేసింది.పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ పరిస్థితులు, కార్మికవర్గ రాజకీయాలు ఈ ఉద్యమానికి కొత్త ఊపునిచ్చాయి. నవంబర్, 67 నుండి మార్చి ,69 వరకు (రాష్ట్రపతి పాలన అమలుఉన్న కాలంలో) అక్కడ ప్రజాతంత్ర ఉద్యమం బీమా ఉద్యోగుల పోరాటాలకు రక్షణాకవచంగా ఉంది.1969 ఎన్నికలలో యునైటెడ్ ఫ్రంట్ ఎన్నిక బీమా ఉద్యోగుల పోరాట విజ యానికి బాసటగా నిలిచింది. ఆనాడే కంప్యూటర్లు ఎల్ఐసిలో ప్రవేశించి ఉంటే వేలాది మంది ఉద్యోగాలుపోవడమే గాక, సంస్థలో తర్వాత తరాల ఉద్యోగులకే ఉద్యోగ అవకాశాలు ఉండేవి కావు. అందుకే ఈ మహత్తర పోరాటంలో లెఫ్ట్ ఫ్రంట్ ప్రాధాన్యతను, జ్యోతిబసు చిరస్మరణీయమైన పాత్రను ఎల్ఐసి ఉద్యోగులు నిరంతరం జ్ఞాపకం ఉంచుకుంటారు.

1978లో కలకత్తాలో జరిగిన ఏఐఐఇఏ సిల్వర్ జూబ్లి సమావేశాలకు జ్యోతిబసు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీమా రంగాన్ని ప్రయివేటుపరం చేయడంతో బాటు, ఎల్ఐసి, జిఐసిలలో యాభైశాతం వాటాలు విక్రయించాలన్న మల్హోత్రా కమిటీ (1994) కమిటీ సిఫార్సులకు వ్యతిరేకంగా ఆనాడు వామ పక్షాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశాయి. జ్యోతిబసు ఆధ్వర్యంలోని పశ్చిమ బెంగాల్ లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం, మల్హోత్రా కమిటీ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ఆమోదించింది.అలాగే అప్పటి వామపక్ష ప్రభుత్వాలు అధికారంలో ఉన్న కేరళ, త్రిపుర ప్రభుత్వాలు సైతం ఇదే మాదిరిగా తీర్మానాలు ఆమోదించాయి.ప్రభుత్వ బీమారంగ పరిరక్షణ కోసం ఎల్ఐసి ఉద్యోగులు చేసిన ప్రతి పోరాటానికి సంపూర్ణ సహకారం అందించి, జ్యోతిబసు మొత్తం కార్మిక వర్గంతో బాటు, ఎల్ఐసి ఉద్యోగులకు కూడా ప్రీతి పాత్రులయ్యారు. లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వంఅధికారంలో ఉన్నంత కాలం పశ్చిమబెంగాల్‌లో శాంతి, సామరస్యాలు పరిఢవిల్లాయి. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత సందర్భంగా దేశమంతా మత కల్లోలాలు ప్రజ్వరిల్లినా, పశ్చిమ బెంగాల్‌లో ఒక్క అవాంఛనీయ సంఘటన జరగలేదు. మతోన్మాదశక్తుల పీచమనచడంలో జ్యోతిబసు ప్రభుత్వం స్ఫూర్తివంతమైన పాత్ర పోషించింది.నేడు దేశంలో నెలకొన్న మత ఉద్రిక్తత పరిస్థితులు పురోగామి శక్తులను కలవరపెడుతున్నాయి. ఇటువంటి తరుణంలో జ్యోతి బసు లాంటి పాలనాదక్షుల, రాజనీతిజ్ఞుల అవసరాన్ని మొత్తం దేశం గుర్తిస్తోంది ఎల్ఐసి సంస్థపై, ఉద్యోగులపై, కార్మికవర్గంపై నిరంతరం దాడులు జరుగుతున్న ప్రస్తుత నేపథ్యంలో జ్యోతిబసు జీవితం కార్మిక వర్గానికి, ప్రత్యేకించి బీమా ఉద్యోగులకు ప్రేరణ ఇస్తుంది. ఎల్ఐసి సంస్థను,ప్రభుత్వ రంగాన్ని, కార్మిక హక్కులను, దేశ సమ్మిళిత సంస్కృతిని, సెక్యులర్, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి కృషి చేయడమే జ్యోతిబసుకు బీమా ఉద్యోగులిచ్చే నిజమైన నివాళి.

# చరిత్ర తిరగరాయటం తెలుగువాళ్లతోనే సాధ్యం

- మొదటి పేజి తరువాయి
ఇది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు చక్కటి ఉదాహరణ“ అని అన్నారు. 495 ఎకరాల్లో, 2 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారని వెల్లడించారు. 2027 జూన్ నాటికి ఉత్పత్తి ప్రారంభించి, ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియాను ఇక్కడి నుంచి జర్మనీ వంటి దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యాన్ని అందిపుచ్చుకుని, రాష్ట్రంలో 160 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేశామని చంద్రబాబు తెలిపారు. “సౌర, పవన, జల విద్యుత్‌తో పాటు పంప్డ్ స్టోరేజీకి ఏపీ అత్యంత అనుకూలమైన రాష్ట్రం. మనకున్న సుదీర్ఘ తీరప్రాంతం, రాబోయే 20 పోర్టులతో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ఉత్పత్తికి ఏపీ కేంద్రంగా మారుతుంది. భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీపై ఎక్కడ చర్చ వచ్చినా కాకినాడ పేరు వినిపిస్తుంది“ అని ఆయన పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ‘క్లీన్, గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ పాలసీ-2024‘ దేశంలోనే అత్యుత్తమమైనదని, పారిశ్రామికవేత్తలకు పూర్తి స్వేచ్ఛనిస్తూ, ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకుండా అనుమతులు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు.రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, “విశాఖలో గూగుల్ సంస్థ 1 గిగావాట్ సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ ఏడాదిలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. స్పేస్ టెక్నాలజీలో కూడా పురోగతి సాధిస్తాం. ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ ఎకానమీ హబ్‌గా తీర్చిదిద్దుతాం“ అని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో పరిశ్రమలపై విద్యుత్ కొనుగోలు భారాన్ని యూనిట్‌కు రూ.1.19 మేర తగ్గించేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే 29 పైసలు తగ్గించామని తెలిపారు. గ్లోబల్ సంస్థలన్నీ ఏపీ నుంచి తమ కార్యకలాపాలు నిర్వహించాలని పిలుపునిచ్చిన ఆయన, రాష్ట్రంలోకి వచ్చే ప్రతి పెట్టుబడికి ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

## బంగ్లాదేశ్‌లో దారుణం.. మరో హిందువు దారుణ హత్య

బంగ్లాదేశ్‌లో మరో హిందువు దారుణ హత్యకు గురయ్యాడు. గత మూడు వారాల్లోనే బంగ్లాదేశ్‌లో పది మందికి పైగా హిందువులు హత్యకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా, పెట్రోల్ పంపులో ఇంధనం నింపుకుని డబ్బులు చెల్లించకుండానే వెళ్లిపోతున్న వ్యక్తిని అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు హిందూ వ్యక్తిని వాహనంతో ఢీకొట్టి హతమార్చారు. ఈ విషాద సంఘటన రాజ్‌బరి జిల్లాలో చోటుచేసుకుంది. మృతుడిని 30 ఏళ్ల రిపోన్ సాహాగా గుర్తించారు. అతడు అక్కడి పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడని పోలీసులు వెల్లడించినట్లు అక్కడి మీడియా వర్గాలు తెలిపాయి. రాజ్‌బరిలోని కరీం ఫిల్లింగ్ స్టేషన్‌లో రిపోన్ సాహా ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) రాజ్‌బరి జిల్లా యూనిట్ మాజీ కోశాధికారి అబుల్ హాషేమ్ పెట్రోల్ నింపుకున్న తర్వాత డబ్బులు చెల్లించకుండానే వెళ్లడానికి ప్రయత్నించాడు. దీంతో రిపోన్ అతడిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, హాషేమ్ తన కారును అతనిపైకి పోనిచ్చాడు. తీవ్ర గాయాలపాలైన రిపోన్ అక్కడికక్కడే మృతి చెందాడు.పోలీసులు కేసు నమోదు చేసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హాషేమ్, అతడి కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## చైనా స్కూలులో నోరో వైరస్ కలకలం.. వంద మందికి పైగా సోకిన వైరస్

చైనాలోని ఓ స్కూలులో వైరస్ కలకలం రేగింది. వంద మందికి పైగా విద్యార్థులు అనారోగ్యానికి గురికావడంతో వైద్యాధికారులు రంగంలోకి దిగి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 103 మంది విద్యార్థులకు ‘నోరా వైరస్’ సోకినట్లు తేలింది. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం.. క్లాస్ రూమ్ లతో పాటు స్కూలు ఆవరణలో వైరస్ ను నాశనం చేసే మందును చల్లారు. వైరస్ బాధిత విద్యార్థులకు చికిత్స అందజేస్తూనే మిగతా విద్యార్థులకు వైరస్ సోకకుండా చర్యలు చేపట్టారు.బాధిత విద్యార్థులు అందరూ కోలుకుంటున్నారని వివరించారు. రోజూ విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షిస్తూ ప్రత్యేక హాజరు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్కూలు పరిసరాల్లోని నివాస సముదాయాల్లో ఉంటున్న వారికి వైరస్ పరీక్షలు చేపట్టినట్లు వివరించారు. గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ డిసీజ్ కంట్రోల్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..
ఏటా అక్టోబర్ నుంచి మార్చి మధ్య ప్రావిన్స్ లో నోరో వైరస్ విజృంభిస్తుందని అధికారులు తెలిపారు. వైరస్ బాధితులు ప్రధానంగా వాంతులు, విరేచనాలతో బాధపడుతుంటారని చెప్పారు. ఈ వైరస్ సాధారణమైందేనని, వైరస్ వ్యాప్తి చాలా వేగంగా ఉంటుందని వివరించారు. ఈ వైరస్ ను తొలిసారి 1968 లో అమెరికాలోని ఓహియో రాష్ట్రం నార్ వాక్ లోని ఓ స్కూలులో గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈ వైరస్ ను నోరో వైరస్ గా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు.
అమెరికాలో ఎక్కువగా ఆహారం ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుందని చెప్పారు. ఏటా ప్రపంచవ్యాప్తంగా 68.5 కోట్ల మంది ఈ వైరస్ బారిన పడుతుండగా.. అందులో 20 కోట్ల మంది ఐదేళ్లలోపు చిన్నారులేనని గణాంకాలు చెబుతున్నాయి. ఈ వైరస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 50 వేల మంది చిన్నారులు సహా 20 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని సమాచారం.

## బీహార్‌లో గెలిచాం.. బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది

- మొదటి పేజి తరువాయి
కాంగ్రెస్ పార్టీకి హింస, బుజ్జగింపు రాజకీయాలు కావాలని ఆయన విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన నొక్కి చెప్పారు.రాష్ట్రానికి అసలైన సవాల్ చొరబాటుదారులేనని మోదీ పేర్కొన్నారు. చొరబాట్లను అరికట్టడంలో తృణమూల్ ప్రభుత్వం విఫలమైందని ఆయన దుయ్యబట్టారు. మాల్దా, ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగడానికి చొరబాట్లే కారణమని ఆయన ఆరోపించారు. బెంగాల్ రాష్ట్రానికి
వరద సహాయ నిధులను కేంద్రం 40 సార్లు అందించినా, ఆ నిధులు అసలైన లబ్ధిదారులకు చేరలేదని ప్రధానమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే బీజేపీ ప్రభుత్వం ఇక్కడ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నారని ఆయన అన్నారు.

# యుద్ధం ముగియలేదు... ఇప్పుడే ప్రారంభమైంది

మహారాష్ట్రలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంతో తమను నిర్వీర్యం చేశామని భావిస్తున్న బీజేపీ నేతలకు అది ఎప్పటికీ సాధ్యం కాదని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే స్పష్టం చేశారు. యుద్ధం ఇప్పుడే మొదలైందని, ఇది ముగింపు కాదని ఆయన ఉద్ఘాటించారు. బీజేపీ కుట్రలను త్వరలోనే బయటపెడతామని అన్నారు. ముంబైలో శివసేన (యూబీటీ) నుంచి మేయర్‌ను నియమించాలనేది తన కల అని, అదే నెరవేరాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని ఆకాంక్షించారు. స్థానిక ఎన్నికల్లో అవకతవకలు జరగడం వల్లే బీజేపీ గెలుపొందిందని ఉద్ధవ్ థాకరే ఆరోపించారు. కుట్రపూరితంగా, అక్రమంగా విజయం సాధించిందని దుయ్యబట్టారు. ముంబైని పూర్తిగా తాకట్టు పెట్టాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల్లో తమ పార్టీ 64 స్థానాలను కైవసం చేసుకుందని గుర్తు చేశారు. 227 స్థానాలున్న బీఎంసీలో బీజేపీ 89 స్థానాలు, శివసేన (షిండే) 27 స్థానాలు, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) 64 స్థానాల్లో విజయం సాధించాయి.

## గోరంట్ల మాధవ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ

- మొదటి పేజి తరువాయి
జారీ చేసినప్పటికీ గోరంట్ల మాధవ్ హాజరు కాకపోవడంతో, చివరకు కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అయితే, తనపై జారీ అయిన నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను రీకాల్ చేయాలని కోరుతూ గోరంట్ల మాధవ్ సోమవారం కోర్టును ఆశ్రయించనున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ కేసు తదుపరి విచారణలో ఏం జరుగుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## కత్తులతో దాడి చేసుకున్న టీడీపీ, వైసీపీ కార్యకర్తలు.. టీడీపీ కార్యకర్త మృతి

కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలోని టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకోవడంతో, ఇరు వర్గాలు కత్తులతో దాడి చేసుకున్నాయి. ఈ దాడిలో టీడీపీ కార్యకర్త బంగారయ్య మృతి చెందాడు. మరో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు దుర్గా ప్రసాద్, శ్రీరామమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వీరిద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైసీపీ కార్యకర్తలు నారాయణమూర్తి, సతీశ్ లకు కూడా తీవ్ర గాయాలు కావడంతో... వీరిని కూడా ఆసుపత్రికి తరలించారు. ఘర్షణ వివరాల్లోకి వెళితే... టీడీపీ కార్యకర్తలు ఒక పుట్టినరోజు వేడుకకు వెళ్లి వస్తుండగా వారికి వైసీపీ కార్యకర్తలు ఎదురుపడ్డారు. ఈ క్రమంలో ఘర్షణ చోటుచేసుకుంది. పాత గొడవలే దీనికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

## 11 సీట్లకే పరిమితమైనా మీ ‘తాచుపాము‘ బుద్ధి మారలేదు

- మొదటి పేజి తరువాయి
‘జై‘ కొట్టిన జగన్మోహన్ రెడ్డి, అధికారం రాగానే ‘నై‘ అని మాట మార్చి రాష్ట్ర ప్రజలను దారుణంగా వంచించారు. ఐదేళ్ల పాటు రాజధాని లేకుండా చేసి ప్రజల కలలను విధ్వంసం చేశారు“ అని పార్థసారథి మండిపడ్డారు.
2019కి ముందు అమరావతే రాజధాని అని, తాను తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నానని నమ్మబలికిన జగన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక తుగ్లక్ పాలనను తలపించేలా మూడు రాజధానుల నాటకం ఆడారని విమర్శించారు. రాజధాని కోసం 33 వేల ఎకరాలు త్యాగం చేసిన 29 వేల మంది రైతులను అవమానించారని, అమరావతిని ఎడారి, శ్మశానంతో పోల్చారని గుర్తుచేశారు. “సొంత అవసరాల కోసం వందల ఎకరాల్లో, వేల చదరపు అడుగుల ప్యాలెస్‌లు కట్టుకున్న నాయకులు, ఐదు కోట్ల ప్రజలకు రాజధాని అవసరమా అని ప్రశ్నించడం సిగ్గుచేటు. కులాల మధ్య చిచ్చు, ప్రాంతాల మధ్య విషం చిమ్ముతూ నీచ రాజకీయాలు చేయడం జగన్ రెడ్డికి అలవాటుగా మారింది“ అని దుయ్యబట్టారు. అమరావతిపై ఇన్సైడర్ ట్రేడింగ్ అంటూ అసత్య ఆరోపణలు చేసి హైకోర్టు, సుప్రీంకోర్టుల చేత మొట్టికాయలు తిన్నా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదని పార్థసారథి అన్నారు.
“పీపీపీ విధానంలో రాష్ట్రానికి వచ్చే సంస్థలను ‘మేం వస్తే అరెస్ట్ చేస్తాం‘ అని బెదిరించడం అత్యంత జుగుప్సాకరం. ఇది రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసే కుట్ర కాదా?“ అని ప్రశ్నించారు. చంద్రబాబు సైబరాబాద్‌ను నిర్మించినప్పుడు కూడా ఇలాంటి విమర్శలే వచ్చాయని, కానీ నేడు ఆ ప్రాంతం విలువ అందరికీ తెలుసని అన్నారు. అమరావతి పూర్తయితే వచ్చే లక్షల కోట్ల సంపదతోనే రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతిలో పనులు శరవేగంగా సాగుతున్నాయని, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులతో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. విశాఖ, అనకాపల్లి ప్రాంతాల్లోనూ టీసీఎస్, రిలయన్స్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. “రాజ్యాంగంపై గౌరవం లేని వైసీపీ, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం లేక బయట కూర్చుని విషప్రచారం చేస్తోంది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఈ నిజాన్ని ప్రజలు గ్రహించి, విధ్వంసకర శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి“ అని మంత్రి పార్థసారథి పిలుపునిచ్చారు.

# నేడు దావోస్‌కు సీఎం చంద్రబాబు...

ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు (జనవరి 18) స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ప్రపంచ ఆర్థిక సదస్సు (వరల్డ్ ఎకనామిక్ ఫోరం)లో పాల్గొనేందుకు ఆయన మంత్రులు, ఉన్నతాధికారుల బృందంతో కలిసి ఆదివారం బయల్దేరి వెళ్లనున్నారు. జనవరి 19 నుంచి 22 వరకు నాలుగు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ఆయన అత్యంత బిజీగా గడపనున్నారు. మొత్తం 36 కార్యక్రమాల్లో పాల్గొంటూ, ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక దిగ్గజాలతో ముఖాముఖి సమావేశాలు జరపనున్నారు.

ఆదివారం రాత్రి 8:35 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి, అక్కడి నుంచి జ్యూరిచ్‌కు ముఖ్యమంత్రి పయనం కానున్నారు. జనవరి 19న ఉదయం జ్యూరిచ్ చేరుకున్నాక, స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్ ఆయనతో మర్యాదపూర్వకంగా సమావేశమవుతారు. అనంతరం ఎరోస్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కిశోర్ లుల్లా, ఆయన బృందంతో భేటీ అవుతారు. పర్యటనలో తొలి ముఖ్య కార్యక్రమంగా, జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో భారత ఎంబసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘తెలుగు డయాస్పోరా’ సదస్సులో చంద్రబాబు పాల్గొంటారు. సుమారు 20 దేశాల నుంచి హాజరయ్యే ప్రవాస తెలుగువారిని (ఎన్నార్టీలు) ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో దావోస్ చేరుకుంటారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆర్థిక, పర్యాటక శాఖల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో జరిగే అంతర్జాతీయ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ముఖ్యమంత్రితో సమావేశమవుతారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ కూడా సీఎంతో భేటీ కానున్నారు. ప్రముఖ విదేశీ మీడియా సంస్థ ‘పొలిటికో’కు చంద్రబాబు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు.

### టెక్ దిగ్గజాలతో కీలక చర్చలు

పర్యటనలో రెండో రోజు అత్యంత కీలకంగా జరగనుంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహించే ‘ఇండియా ఎట్ సెంటర్: జియోగ్రఫీ, గ్రోత్ - ఏపీ అడ్వాంటేజ్‘ అనే బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో ముఖ్యమంత్రి పాల్గొని రాష్ట్రంలోని అవకాశాలను వివరిస్తారు. అనంతరం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ‘ఇండియా లాంజ్‘ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత టెక్నాలజీ రంగంలో ప్రపంచ దిగ్గజ సంస్థలైన ఐబీఎం ఛైర్మన్, సీఈఓ అరవింద్ కృష్ణ, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌లతో చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ భేటీ అవుతారు. ఈ సమావేశాల్లో రాష్ట్రానికి టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. అదే రోజు ఇజ్రాయెల్ ఆర్థిక, పారిశ్రామిక మంత్రి నిర్ బర్కత్‌తో, స్విట్జర్లాండ్ ఆర్థిక వ్యవహారాల డిప్యూటీ మంత్రి హెలెన్ బడ్లిజెర్ అర్టెడాతోనూ చర్చలు జరుపుతారు. ఎన్విడియా ఉపాధ్యక్షుడు కాలిస్టా రెడ్‌మండ్‌తో పాటు, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్‌తోనూ సమావేశమవుతారు. రాష్ట్రంలో పోర్టులు, లాజిస్టిక్స్ రంగాల అభివృద్ధికి అత్యంత కీలకమైన అంతర్జాతీయ కంటైనర్ లాజిస్టిక్స్ సంస్థ ఏపీ మోలర్-మేర్స్క్ సీఈఓ విన్సెంట్ క్లెర్క్‌తో ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ ముఖాముఖి సమావేశం కానున్నారు.

### వివిధ అంశాలపై చర్చా వేదికల్లో ప్రసంగాలు

మూడో రోజు పర్యటనలో భాగంగా, ‘హీలింగ్ ప్లానెట్ త్రో రీజెనరేటివ్ ఫుడ్ సిస్టమ్స్‘ అనే అంశంపై జరిగే చర్చా కార్యక్రమంలో, బ్లూమ్‌బెర్గ్ సంస్థ నిర్వహించే ‘ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్: ఏఐ మూమెంట్ ట్రాన్స్‌ఫార్మింగ్ గ్లోబల్ ఎకానమీ‘ సెషన్‌లో ముఖ్య వక్తగా ప్రసంగిస్తారు. పారిశ్రామిక పురోగతి, వాతావరణ మార్పులపై ఫైనాన్సింగ్ వంటి అంశాలపై జరిగే పలు సెషన్లలో కూడా ఆయన పాల్గొంటారు. ఏపీ లాంజ్‌లో కేంద్ర మంత్రులతో కలిసి ‘బిల్డింగ్ ఇండియా ఇన్ఫ్రాస్ట్రక్చర్‘ కార్యక్రమంలో పాలుపంచుకుంటారు.

మొత్తంగా ఈ నాలుగు రోజుల పర్యటనలో 3 ప్రభుత్వాల మధ్య సమావేశాలు, 16 మంది పారిశ్రామికవేత్తలతో వన్-టు-వన్ భేటీలు, 9 రౌండ్ టేబుల్ సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సీఎన్‌బీసీ ఇంటర్నేషనల్ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో ఒక కీలక పెట్టుబడుల గమ్యస్థానంగా నిలపడమే లక్ష్యంగా ఆయన పర్యటన సాగనుంది. ఇక జనవరి 22న దావోస్ నుంచి బయల్దేరి, 23వ తేదీ ఉదయం 8:25 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్ చేరుకుంటారు.

# అంబాజీపేట ప్రభల తీర్థంలో పాల్గొన్న స్టాలిన్ బాబు

**అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 17:** అంబాజీపేట లో నిర్వహించిన ప్రజల తీర్థంలో వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు నేలపూడి స్టాలిన్ బాబు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు చెందిన మైన ప్రభల ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నదని ఆయన అన్నారు. ఆయన వెంట బాజీపేట ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు నాయకులు పేరి శ్రీనివాసరావు, మైలే ఆనందరావు, గోసంగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా


# జగ్గన్నతోటలో భక్తి ప్రభంజనం: రాష్ట్ర పండుగగా ప్రభల తీర్థం!





- ★ కోనసీమ ఆధ్యాత్మిక వైభవం జగ్గన్నతోటలో కొలువుదీరిన ఏకాదశ రుద్రులు!
- ★ భక్త సంద్రంగా మారిన తీర్థం.. చేల గట్లు,కౌశిక దాటుతూ శివయ్య రాక!
- ★ జగ్గన్నతోటలో 'శరభ శరభ' అచ్చరభ...
- ★ భక్తుల భుజ స్కందాలపై ఏకాదశ ప్రభలు
- ★ కోనసీమ గడ్డపై భక్తులతో ఉప్పొంగిన శివనామభక్తి సముద్రం
- ★ శైవ వైభవానికి చిరునామాౌ జగ్గన్నతోట

**అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 17:**భక్తి, వీరత్వం, సంప్రదాయరౌ ఈ మూడింటి సంగమంగా జగ్గన్నతోట ప్రభల తీర్థం ఈ ఏడాది కనీవినీ ఎరుగని మహోత్సవంగా రూపుదిద్దుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ చారిత్రక వేడుకను రాష్ట్ర పండుగ గా ప్రకటించడంతో, కోనసీమ గడ్డ శివనామ స్మరణతో ప్రతిధ్వనించింది. వేలాది మంది భక్తులతో జగ్గన్నతోట పరిసరాలు జనసంద్రంగా మారి, ఆధ్యాత్మిక ఉత్సాహం అంబరాన్ని తాకింది. పచ్చని చేల మధ్య భక్తికి అగ్నిపరీక్ష వరి చేల గట్ల వెంట, కౌశిక నదీ దాటుతూ, బురదతో నిండిన నేలపై, శరీరమంతా మట్టితో నిండినా మనసంతా శివభక్తితో ఉప్పొంగుతూ యువకులు ప్రభలను భుజాలపై మోసుకుంటూ ముందుకు సాగారు. ప్రతి అడుగు ఓ పరీక్షౌ ప్రతి అడుగు ఓ త్యాగం.ఈ సాహసోపేత ప్రయాణం భక్తుల హృదయాలను కదిలించింది. కౌశిక నదిలో కలిసిన భక్తి వీరత్వం ఈ తీర్థానికి హృదయం లాంటిది కౌశిక నది దాటే ఘట్టం. గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి, గంగలకుర్రు చెన్నకేశవ మల్లేశ్వరస్వామి ప్రభలు మోకాళ్ల లోతు నీటిలోకి దిగిన క్షణరౌ బరువైన ప్రభలు పక్కకు వాలినా సమతుల్యతతో మోస్తూ,"శరభౌ శరభౌ" అనే శివనామ నాదంతో నదిని దాటిన ఆ దృశ్యం భక్తుల కళ్లలో నీళ్లను తెప్పించింది.

ఆ క్షణం కౌశిక నది కూడా శివభక్తిలో లీనమైనట్టే అనిపించింది. జగ్గన్నతోటలో కొలువుదీరిన ఏకాదశ రుద్రులు భక్తులకు ప్రత్యక్ష కైలాస దర్శనాన్ని అందించారు. వరి కంకులు, రంగురంగుల పుష్పాలు, నెమలి పింఛాలతో అలంకరించిన ప్రభలు ఆధ్యాత్మిక కాంతులతో వెలిగిపోయాయి.

ఏకాదశ రుద్రులు:

గంగలకుర్రు అగ్రహారం -- వీరేశ్వరస్వామి
గంగలకుర్రు -- చెన్నకేశవ మల్లేశ్వరస్వామి
వ్యాఘ్రేశ్వరం -- వ్యాఘ్రేశ్వరస్వామి
కె. పెదపూడి -- మేనకేశ్వరస్వామి
ఇరుసుమండ -- ఆనందరామేశ్వరస్వామి
వక్కలంక -- కాశీవిశ్వేశ్వరస్వామి
నేదునూరు -- చెన్నమల్లేశ్వరస్వామి
ముక్కామల -- రాఘవేశ్వరస్వామి
మొసలపల్లి -- మధుమానంత భోగేశ్వరస్వామి
పాలగుమ్మి -- చెన్నమల్లేశ్వరస్వామి
పుల్లేటికుర్రు -- అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి

శివనామంతో మారుమోగిన కోనసీమ జగ్గన్నతోట నుంచి కౌశిక నది ఒడ్డువరకూ ఎటు చూసినా"ఓం నమః శివాయ", "శరభ శరభ" నినాదాలతో వాతావరణం కంపించింది.వేలాది మంది భక్తులు ఈ అపూర్వ ఘట్టాన్ని తమ కెమెరాల్లో బంధిస్తూ, జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకాలుగా మలుచుకున్నారు.

ప్రజాప్రతినిధుల హాజరౌపండుగకు మరింత వైభవం

ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ హరీష్ మాధుర్, రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతి కమిషన్ చైర్పర్సన్ పొడపాటి తేజస్విని, జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ పలువురు ప్రజా ప్రతినిధులు హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ పండుగ కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు.

భక్తి -- వీరత్వం,సంప్రదాయం జగ్గన్నతోట ప్రభల తీర్థం

జగ్గన్నతోట ప్రభల జాతర మరోసారి నిరూపించిందౌఇది కేవలం పండుగ కాదు,ఇది ఒక విశ్వాసరౌఇది ఒక తరం నుంచి మరో తరానికి అందే ఆధ్యాత్మిక వారసత్వం.కోనసీమ గడ్డపై నిలిచిన ఈ శైవ వైభవం, యుగయుగాల పాటు భక్తుల హృదయాల్లో నిలిచిపోతుంది. తీర్థం ప్రశాంత వాతావరణం ఆధ్యాత్మిక తో కన్నుల పండుగగా సాగింది.

ప్రభల తీర్థానికి భారీ బందోబస్తీ

జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో మొసలపలల్లి శివారు జగ్గన్న తోటలో నిర్వహించిన ప్రభల తీర్థానికి డా.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్.పి.రాహుల్ మీనా ఆదేశాల మేరకు భారీ బందోబస్తీ ను ఏర్పాటు చేసినట్లు కొత్తపేట డి.ఎస్.పి. సుంకర మురళీ మోహన్ పి.గన్నవరం సి.ఐ, ఆర్.భీమరాజు పర్యవేక్షణలో స్థానిక ఎస్సై కె. చిరంజీవి ఆధ్వర్యంలో 314 మందితో భారీ బందోబస్తీ నిర్వహించారు. అలాగే తొండవరం, వాకలిగరువు, చిరతపూడి ప్రాంతాల్లో కూడా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించారు.





## కాకినాడ లో ఏఎం గ్రీన్ అమ్మోనియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్లాంట్ ప్రాజెక్టు శంకుస్థాపన

హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**కాకినాడ రూరల్, పెన్ పవర్, జనవరి 17:**ఏఎం గ్రీన్ అమ్మోనియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్లాంట్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ బాలయోగి, డీఐజీ అశోక్ కుమార్, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బారాజు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, యనమల దివ్య, వి. సత్యప్రభ, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరయ్యారు.ఏఎం గ్రీన్ అమ్మోనియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సిహెచ్. అనిల్ కుమార్, ప్రాజెక్ట్ హెడ్ సిహెచ్. శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస నాయుడు, కార్యక్రమ సమన్వ యకర్త వి. నాగవర్ధన్, ప్లాంట్ యాజ మాన్యం ప్రతినిధులు పాల్గొన్నారు.మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్.వీ.ఎస్.ఎన్. వర్మ, మాజీ జెడ్పీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని తిరుమల కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

## కెరియర్ గైడెన్స్ కోసం ప్రత్యేక 'డిజిటల్ పోర్టల్ల ఏర్పాటు



- ✸ విద్యార్థుల అనుభవాలే ప్రస్తుత విద్యార్థులకు దిక్సూచి
- ✸ జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేశ్ కుమార్

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 17:**ప్రస్తుత విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో పూర్వ విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అన్నారు.

శనివారం మామిడి కుదురు శ్రీ గోకరాజు గణాధిపతి మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 1988 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగకు పూర్వ విద్యార్థులు తమ స్వగ్రామాలకు చేరుకునే సందర్భంలో ఇలాంటి సమ్మేళనాలు నిర్వహించడం ద్వారా వారి అనుభవాధారిత కెరీర్ ప్రణాళికలను ప్రస్తుత విద్యార్థులకు తెలియజేసి ప్రేరణ కల్పించవచ్చున్నారు.

కెరీర్ డెవలప్‌మెంట్ కోసం కరపత్రాలు, డిజిటల్ పోర్టల్‌ల నిర్వహణ ద్వారా విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా 1988 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సీఎస్ఆర్ నిధుల సహకారంతో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌లను జిల్లా కలెక్టర్ పూర్వ విద్యార్థులతో కలిసి ప్రారంభించారు.

భవిష్యత్ కెరీర్‌ను రూపుదిద్దుకున్న పూర్వ విద్యార్థులు ఇక్కడి నుంచి ప్రపంచవ్యాప్తంగా విజయాలు సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకొని ప్రస్తుత విద్యార్థులు తమ ఆసక్తి ఉన్న రంగాల్లో దశలవారీగా అభివృద్ధి సాధించాలని కోరారు. కెరీర్ డెవలప్‌మెంట్ ప్లాన్ లేకుండా ఉన్నత లక్ష్యాలు సాధ్యం కావని తెలిపారు. విద్యార్థులు తమ బలాలు, బలహీనతలు, ఆసక్తులను స్వీయ మూల్యాంకనం చేసుకుని వ్యవసాయం, సాంకేతికత, పరిపాలన వంటి రంగాల్లో ఉన్న అవకాశాలను వినియోగించు కోవాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ సాధనాలు, భాషా నైపుణ్యాలు, కమ్యూనికేషన్‌లో ప్రావీణ్యం సాధించాలని అన్నారు.

వ్యవసాయ ఆధునీకరణలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఆన్‌లైన్ కోర్సులు, వర్క్‌షాప్‌లు ద్వారా భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చున్నారు. ముందుగా లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రభుత్వ పరీక్షలు, స్కాలర్‌షిప్‌లు, ఇంటర్న్‌షిప్‌ల కోసం ప్రయత్నించాలని తెలిపారు. వైఫల్యాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని, ప్రభుత్వం విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాధారిత కెరీర్ ప్రయాణాన్ని ఒక సమగ్ర పోర్టల్ ద్వారా పంచుకోవడం అభినందనీయమని, ఇది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచడంలో దోహదపడు తుందన్నారు. కెరీర్ డెవలప్‌మెంట్ అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల అభివృద్ధి, బాధ్యతాయుత పౌరులుగా ఎదగడం కూడా అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి నవీన్ మాట్లాడుతూ, పూర్వ విద్యార్థులే నిజమైన ప్రేరణ అని, వారి అనుభవాలు ప్రస్తుత విద్యార్థుల కలలకు దారి చూపుతాయని అన్నారు. డిజిటల్ యుగంలో కెరీర్ డెవలప్‌మెంట్ సాంకేతికతతో కలిసి సాగాలని, ఈ పోర్టల్ పూర్వ మరియు ప్రస్తుత విద్యార్థుల మధ్య బలమైన బ్రిడ్జ్‌గా పనిచేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఈవో పి. నాగేశ్వర రావు, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి. మమ్మీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి, 1988 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాల ద్వారా మెరుగైన ప్రజా పాలన

నూతన సచివాలయ భవనం ప్రారంభించిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, పెన్ పవర్, జనవరి 17:**రాష్ట్రంలో సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన పాలన అందిస్తూ, ప్రజలకు జవాబుదారీ తనంగా సేవలు అందిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.శనివారం రామచంద్రపురం మండలం ఉండూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని గ్రామ సర్పంచ్ చిగురుపాటి రామలక్ష్మి, వెల్లు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు చిగురుపాటి సాయిరాం, సొసైటీ చైర్మన్ మేడిశెట్టి రాధాకృష్ణ, కోట పీఏసీఎస్ చైర్మన్ గాలి మకర జ్యోతిలతో కలిసి మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు సచివాలయ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు.ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు అందేలా పాలనను సులభతరం చేశామని అన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ఉద్యోగులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వెలంపాలెం సర్పంచ్ టేకుమూడి సత్య నారాయణ, ఉండూరు మాజీ సర్పంచ్ కుక్కల వీరవెంకటరావు, గ్రామ పెద్దలు, కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామ సచివాలయ సిబ్బంది,అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు,డ్వాక్రాయానిమేటర్లు,ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అలనాటి చక్రతీర్థం నేడు- ప్రభల తీర్థం



**అంబాజీపేట, పెన్ పవర్, జనవరి17:**నూటిరవై ఏళ్ల నాటి చక్రతీర్థం నేడు ప్రభల తీర్థం పేరుతో అంబాజీపేట లో ఘనంగా నిర్వహించారు. మాచవరం గ్రామంలో శ్రీరామునిచే ప్రతిష్ఠించబడిన శ్రీరామ్ ఘాట్ ప్రాంతంలో వేంచేసియున్న శ్రీ పార్వతీ రాజేశ్వర స్వామి, శ్రీ కందుల మల్లేశ్వర స్వామి, శ్రీ యవగణపతి స్వామి వార్ల ప్రభల ఉత్సవం అంబాజీపేట లో శనివారం సాయంత్రం ఆధ్యాత్మిక తో భక్తులు తరలివచ్చారు. ముక్కనమ రోజు జరిగి ఈ ప్రభల తీర్థం ప్రభలకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాధూర్, పిఅబశ్రీశ్రీగన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కూటమి నాయకులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్ పి లు మాట్లాడుతూ ప్రభుత్వం తెలుగు సాంస్కృతిక సాంప్రదాలకు ప్రాధాన్యతనిస్తుందని సాంప్రదాయ విలువ లను ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. ప్రధాన కూడలి నుండి తీర్థం పండుగా వాతావరణంలో జరిగింది. తీత మహోత్సవం లో తీన్ మార్, మ్యూజికల్ నైట్, కోలాటం, చోటో బొమ్మలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పి.గన్నవరం సిఐ ఆర్. భీమరాజు పర్యవేక్షణలో ఎస్ ఐ చిరంజీవి ఆధ్వర్యంలో గట్టీ బందోబస్తీ ఏర్పాటు చేసారు.

# ఘనంగా కొప్పిగుంట ప్రాథమిక పాఠశాల శత వసంతాల వేడుక




**కాట్రేనికోన పెన్ పవర్ జనవరి 17:** కాట్రేనికోన మండలం కొప్పిగుంట గ్రామంలో ఎందరో విద్యార్థుల జీవితాలలో వెలుగు రేఖలు ప్రసరింపజేసి ఎందరికో ఉజ్వల భవిష్యత్తును అందించిన మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల స్థాపించి వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా కొప్పిగుంట గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో పాఠశాల శత వసంతాల వేడుక అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామ పెద్దల నేతృత్వంలో కొప్పిగుంట గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో 1925 నుండి 2025 వరకు ఈ గ్రామ బడిలో విద్యాభ్యాసం చేసి ఎక్కడెక్కడో సుదూర ప్రాంతాలలో వివిధ హోదాలలో పదవీవిరమణ చేసిన వారిని వివిధ ఉద్యోగాలలో స్థిరపడిన వారినీ ఆహ్వానించి వారి యొక్క అనుభవాలు వారి యొక్క జ్ఞాపకాలను అందరితో పంచుకుంటూ ఆద్యాంతం ఒక ఆత్మీయ వేడుకలా జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామానికి చెందిన బాల బాలికల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాట్రేనికోన యస్.ఐ అవినాష్ గారు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యాలయాన్ని పవిత్రమైన ఆలయంగా భావించిన గ్రామ పెద్దలు అభినందనీయులని,దేవాలయంలాంటి విద్యాలయం వందేళ్ళ పండుగ నిర్వహించడం ఆనందదాయకమని మన సంస్కృతి సాంప్రదాయాలయిన సంక్రాంతి పర్వదినం సందర్భంగా పాఠశాల శతవసంతాల వేడుక నిర్వహించడం మంచి పరిణామమని తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామ పాఠశాల వందేళ్ళ చరిత్రలో విద్యనభ్యసించినటువంటి వారిని మాత్రమే కాకుండా ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించిన వారిని కూడా ఆహ్వానించడం జరిగినది. వివిధ శాఖలలో ఉద్యోగులుగా ఉపాధ్యాయులుగా వివిధ ప్రాంతాలలో సేవలందించిన ఆనాటి పూర్వ విద్యార్థులు నేటి ప్రముఖులను దుశ్శాలువ అభినందన జ్ఞాపికతో కొప్పిగుంట గ్రామ సేవా సమితి వారిని ఘనంగా సత్కరించుట జరిగినది. ఆనాటి నుండి ఈనాటి వరకు వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను సగౌరవంగా సన్మానించుట జరిగినది. ఓవైపు గ్రామబడి వందేళ్ల పండుగ మరోవైపు సంక్రాంతి పండుగ ప్రతిబింబమైన ముగ్గుల పోటీలతో గ్రామమంతా సందడి వాతావరణంలో ఈ వేడుకలు వైభవంగా జరిగాయి. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల అభ్యున్నతికి తమ సహాయ సహకారాలు అందిస్తామని వక్తలు తమ సందేశాలలో తెలియజేశారు. ఈ వేడుక భవిష్యత్తు తరాలకు ఒక స్ఫూర్తిదాయకంగా మార్గదర్శకత్వంగా నిలవాలని గ్రామంలో విద్యనభ్యసిస్తున్న వారికి ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన మార్గదర్శకత్వాన్ని ఈ గ్రామ సేవా సమితి ద్వారా అందించాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. ఈ వందేళ్ల పండుగలో ఆనాటి మధుర జ్ఞాపకాలను చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సంవత్సరం పదవ తరగతిలొ ప్రగతి సాధించిన విద్యార్థులకు నగదును అందించారు. ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసిన గ్రామ సేవా సమితి,ప్రముఖుల సూచనలు సహకారంతో దిగ్విజయం చేసిన కమిటీ వారికి ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలియజేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రంగోలీ పోటీలలో విజేతలైన వారికి బహుమతి ప్రధానం చేశారు. ఈకార్యక్రమం రాజకీయాలకు అతీతంగా జరగడం విశేషం. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువతి యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# అలరించిన ఐశ్వర్య ఆర్ట్ గ్యాలరి




**కాట్రేనికోన పెన్ పవర్ జనవరి 17:** కాట్రేనికోనలో కనుమ రోజు మెయిన్ రోడ్ లో గల భవానీ ఎంపోరియం వద్ద కుమారి తాతపూడి ఐశ్వర్యచే ఏర్పాటు చేసిన ఐశ్వర్య ఆర్ట్ గ్యాలరి అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ జాతీయ స్థాయి చిత్ర కారుడు ఆకొండి అంజి ప్రారంభించారు. ఇందులో సుమారు రెండు వందలకు పైగా వివిధ కళాకృతులు చిత్రాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా ఫ్రెండ్లీ క్లబ్ సభ్యులు అధ్యక్షుడు తాతపూడి లక్ష్మీ నారాయణ మూర్తి, వ్యవస్థాపకుడు ఆకొండి నాగ రవీంద్ర జోగయ్య శాస్త్రి తదితరులు కుమారి ఐశ్వర్యను జ్ఞాపిక దుశ్శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో తటవర్తి వెంకటరత్నం, తాతపూడి గోపీ, కోట ఉమా మహేశ్వర రావు, వేదుల శ్రీనివాస్, డా.ఆణివిళ్ళ కాశ్యప్, ఆణివిళ్ళ పవన్ కుమార్, శ్రీమతి తాతపూడి మిన్నీ, తాతపూడి మాధుర్య, ధార్మిక ప్రవచకులు బి లక్ష్మీ నారాయణ, స్థానికి నాయకులు గ్రంధి నానాజీ, తదితరులు పాల్గొని చిత్రకారిణి ఐశ్వర్యను అభినందించారు.

# శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట, పెన్ పవర్, జనవరి17;** తెలుగు భాషకు, సంస్కృతికి వన్నె తెచ్చిన మహనీయుడు శ్రీకృష్ణదేవరాయలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు. కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించిన శ్రీకృష్ణదేవరాయల జయంతి, 9వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని జనసేన ఇంచార్జి బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణలతో కలిసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆంధ్రభోజ బిరుదాంకితుడు, విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా శ్రీకృష్ణదేవరాయలు కళలు, సాహిత్యం, తెలుగు భాషకు పెద్దపీట వేశారని తెలిపారు. "దేశభాషలందు తెలుగు లెస్స" అని తెలుగు ఘనతను చాటిన ధీరోదాత్తుడన్నారు. ఆయన పాలనలో వీధుల్లో రత్నాలు అమ్మేవారని చెప్పేంత సుభిక్ష పాలన సాగిందన్నారు. భువనవిజయం నిర్వహించి అష్టదిగ్గజ కవులను పోషించిన మహాచక్రవర్తి కీర్తి తెలుగు జాతి ఉన్నంతకాలం నిలుస్తుందన్నారు. అల్లసాని పెద్దన, నంది తిమ్మన, ధూర్జటి, తెనాలి రామకృష్ణ వంటి కవులు ఆయన ఆశ్రయంలో తెలుగు భాషకు సేవ చేశారని గుర్తుచేశారు. మహానుభావులకు కులం, మతం వర్తించవని, ప్రజల మనోభావాలను అనుసరించే నాయకుడే సత్య నాయకుడని ఆయన అన్నారు.

# అన్న ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించాలి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం పెన్ పవర్ జనవరి 17:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, దివంగత అన్న ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించాలని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. శనివారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. అన్న ఎన్టీఆర్ ఆశయాలను ప్రతి కార్యకర్త స్మరించుకుంటూ ప్రజల మధ్యకు వెళ్లాలని, ఆయన చూపిన మార్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే బండారు పిలుపునిచ్చారు. అలాగే ఆత్రేయపురం ఉత్సవాలు, సంక్రాంతి సంబరాలను రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందేలా విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ విద్యామానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌తో పాటు పలువురు మంత్రులు కొనియాడేలా కోనసీమ వైభవాన్ని చాటడంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషి అభినందనీయమన్నారు. ఆత్రేయపురం ఉత్సవాలు, కొత్తపేట ప్రభల తీర్థం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు.

# కట్టా అప్పారావుకు సతీ వియోగం

- భార్య సత్యవతి గుండెపోటుతో మృతి
- కుటుంబానికి వైసీపీ నేతల సంతాపం

**కాజులూరు, పెన్ పవర్, జనవరి 17:** వైసీపీ సీనియర్ నాయకుడు, దుగ్గుదుర్రు మాజీ ఎంపీటీసీ, తాజా మాజీ సర్పంచ్ కట్టా అప్పారావు సతీ వియోగానికి గురయ్యారు. ఆయన భార్య సత్యవతి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషాద ఘటనపై జిల్లా వైఎస్సార్సీపీ యువజన విభాగ అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కన్వీనర్ పిల్లి సూర్యప్రకాశ్, కాజులూరు మండల పార్టీ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ నాయకులు మాత నూకరావు, పోతు శ్రీనివాసు, కుయ్యేరు మాజీ సర్పంచ్ పోతుల మాధవ, దుగ్గుదుర్రు గ్రామ సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి, జ్యోతికుమార్ తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. భార్య మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన నాయకులు, కట్టా అప్పారావు కుటుంబానికి ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# చొల్లంగి తీర్థం చూద్దాం రండి



**కాట్రేనికోన పెన్ పవర్ జనవరి 17:**

సముద్ర తీర ప్రాంతంలో కొలువై ఉన్న కాలభైరవుని క్షేత్రం పరమ పవిత్రమైనది. సంతానం లేని స్త్రీలు కాలభైరవుని క్షేత్రంలో నిదురిస్తే వారికి పిల్లలు పుడతారని ప్రతీతి. దీంతో ఈ క్షేత్రానికి మహిళ భక్తులు కూడా పెద్ద ఎత్తున వస్తుంటారు.

క్షేత్ర మహిమ: సముద్ర తీర ప్రాంతంలో సముద్రం పై వేట కొనసాగిస్తూ జీవనం కొనసాగించే మత్స్యకార వర్గాలు ఎక్కువగా ఉంటారు. పూర్వం వీరు సముద్రంలో వేటాడుతుండగా పాద ముద్రలు, శివ, పార్వతి శిలలు వలలో చిక్కుకున్నాయి. వీటిని వారు సముద్రంలోకి విసిరేశారు. మరల అదే ప్రాంతంలో అవే శిలలు చిక్కాయి. మరలా రెండోసారి కూడా సముద్రంలోకి విసిరేశారు. మూడోసారి కూడా అవే శిలలు రావడంతో దైవానుగ్రహంగా భావించిన మత్స్యకారులు వాటిని సముద్ర తీర ప్రాంతంలో ప్రతిష్టించారు. ఆలయాన్ని నిర్మించి పూజలు నిర్వహించేవారు. బ్రహ్మదేవుడికి ఉన్న శాపం మూలంగా ఎక్కడ గుడి ఉండదు. ఈశ్వర రూపంలో బ్రహ్మేశ్వరుడు గా కొలువైయున్నాడు. కాలభైరవుడు, వేణుగోపాలుడు, కనకదుర్గ, పార్వతి మొదలైన దేవతామూర్తులు కూడా కొలువై ఉన్నారు.

ప్రతి ఏటా ఉత్సవాలు : ప్రతి ఏటా ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. భారీ ఎత్తున పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. తీర్థం తిలకించడానికి వచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంటారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు.

ఇలా చేరుకోవచ్చు : ఈ ప్రాంతంలో జరిగే చొల్లంగి తీర్థం వీక్షించడానికి జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఇక్కడకు చేరుకుంటారు. మండల కేంద్రమైన కాట్రేనికోన నుండి వేట్లపాలెం, చిర్ర యానాం గ్రామాల మీదుగా రోడ్డు మార్గం గూండా ఇ క్కడకు చేరుకోవచ్చు. గెద్దనపల్లి, దొంతి కుర్రు, పల్లం గ్రామాల మీదుగా ఇక్కడకు చేరుకోవచ్చు.

ఆహ్లాదకరమైన వాతావరణం: సముద్ర తీర ప్రాంతంలో ఉండే ఈ ఆలయం వద్ద వాతావరణంఎంతో ప్రశాంతంగా ఉంటుంది. 17వ తేదీ శనివారం సాయంత్రం భక్తులు ఇక్కడకు చేరుకుంటారు. సూర్యాస్తమయాన్ని సముద్రం వద్ద తిలకిస్తారు. ఆదివారం సముద్ర స్నానం ఆచరించి సముద్ర గర్భం నుండి బయటకు వచ్చే సూర్య భగవానుడిని చూసి తన్మయం చెందుతారు. మార్గం వెంబడి మడ అడవులు కను విందు చేస్తాయి. ఏపీఎస్ఆర్టీసీ అమలాపురం డిపో నుండి ఈ ప్రాంతాన్ని చేరుకోవడానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తారు.

నూతన ఆలయం మరింత శోభితం : పూర్వకాలంలో కట్టిన గుడి శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల నూతన ఆలయాన్ని నిర్మించారు. భక్తులకు కనువిందు చేసే విధంగా ఈ ఆలయ నిర్మాణం ఉంటుంది. ఈ ఆలయ ఆవరణలో నవగ్రహాలను కూడా ఏర్పాటు చేశారు.

పోలీస్ బందోబస్తు : అమలాపురం డిఎస్పి టి ఎస్ ఆర్ కే ప్రసాద్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం సీఐ మోహన్ కుమార్ పర్యవేక్షణలో కాట్రేనికోనతో పాటు వివిధ పోలీస్ స్టేషన్లనుండి

సిబ్బంది ఇక్కడవిధులు నిర్వహిస్తారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పహారా కాస్తారు..

# ఖత్తర్ దేశం లో ఇబ్బందులు స్వదేశానికి మహిళ



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 17:**

ఉపాధికోసం విదేశాలకు వెళ్ళి ఇబ్బందులు పడుతున్న మహిళను స్వదేశాని కరప్పించడంలో జిల్లా కలెక్టర్ కృషి అభినందనీయం.

ఖతార్ దేశంలో ఒక బాబా ఇంటిలో పనిచేస్తుండగా కింద పడి కాలు కి గాయం కావడంతో పనిచేయలేక నరకయాతన పడిన ఉప్పలగుప్తం మండలం పేరాయిచెరువు గ్రామానికి చెందిన పి.వెంకటలక్ష్మి ని క్షేమంగా ఇండియాకు తీసుకువచ్చిన జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల. ఉపాధికోసం పేరాయిచెరువు గ్రామానికి చెందిన పి.వెంకటలక్ష్మి గత సంవత్సరం జులై నెలలో ఖతార్ దేశం వెళ్ళింది. అక్కడ ఒక బాబా ఇంటిలో పనికి కుదిరి పనిచేస్తుండగా కాలు జారి పడిపోయింది. కాలికి బలమైన గాయం తగలడంతో కాలి గాయంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ పని చేయలేకపోతుందని అక్కడ ఇంటి యజమానులు పని చేయక పోతే కుదరదు అని వారు బలవతంగా పనిచేయిస్తున్నారని దానివల్ల మా అక్క చాలా మానసిక, శరీరక ఇబ్బందులు ఎదుర్కొతుందని కనీసం వాళ్ళు హాస్పిటల్ కూడా తీసుకుని వెళ్లడం లేదని కుటుంబ సభ్యులు ఆవేదన చెందాదు. మా అక్కను ఖతార్ దేశం నుండి ఇండియాకు క్షేమంగా తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కు తన సోదరుడు డి. కృష్ణమూర్తి

కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ ఆశ్రయించి తమ చెప్పుకోవడం జరిగిందని స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే జిల్లా కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ బృందాన్ని ఆమెను క్షేమంగా స్వదేశానికి తీసుకుని రప్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ బృందం అక్కడ ఏజెంట్ కుటుంబ సభ్యుల సహకారంతో ఆమెను తిరిగి రప్పించే ఏర్పాట్లు చేపట్టి స్వదేశానికి సురక్షితంగా చేర్చడం జరిగిందని నోడల్ అధికారి మరియు డిఆర్ఓ కే. మాధవి సమన్వయ అధికారి గోళ్ళ రమేష్ తెలిపారు.

# కోకో బీచ్‌లో అంబరాన్నంటిన సంక్రాంతి ముగింపు సంబరాలు....



జనసంద్రమైన యానం తీరం...

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 17:** సురసేన యానాం ఆంధ్ర గోవా కోకో బీచ్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న సంక్రాంతి సంబరాలు ముగింపు వేడుకలు శుక్రవారం అత్యంత అంగరంగ వైభవంగా జరిగాయి. అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ప్రత్యేక పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ముగింపు వేడుకలకు మునుపెన్నడూ లేని విధంగా లక్షలాదిగా జనం తరలివచ్చారు.

ఈ ముగింపు వేడుకలో సినీ సంగీత లోకపు దిగ్గజాలు గీతామాధురి, మోహన భోగరాజు, సాకేత్, అరుణ్ మరియు నెల్లూరు సింగర్స్ తమ గాత్రంతో ప్రేక్షకులను ఉర్రూత లూగించారు. 'సరిగమప' ఆర్కెస్ట్రా టీం అందించిన సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి తన నటనతో, హాస్యంతో నవ్వుల పువ్వులు పూయించారు.

అనంతరం 'ఢీ' ఫేమ్ డ్యాన్సర్లు తేజస్విని, గోవింద్ మాస్టర్ టీం తమ డ్యాన్స్ పర్ఫార్మెన్స్‌తో స్టేజ్‌పై మంటలు పుట్టించారు. ఇన్‌స్టాగ్రామ్ ఫేమ్ వెరోనికా రాకతో యువతలో ఉత్సాహం రెట్టింపయ్యింది. ఆకాశంలో అద్భుతమైన బాణాసంచా ప్రదర్శన జరిగింది. రంగురంగుల వెలుగులతో కోకో బీచ్ ఆకాశం కొత్త శోభను సంతరించుకుంది. ఈ బాణాసంచా వెలుగులు పర్యాటకులను, స్థానికులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ.. నా నియోజకవర్గం ఉభయ రాష్ట్రాల లో ఉన్న ఆడపడుచుల మానసిక ఉల్లాసం కోసం ఈ సంబరాలను ప్రారంభించానని తెలుగు సంస్కృతిని కాపాడుతూ, పర్యాటకాన్ని ప్రోత్సహించడమే ఈ వేడుకల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సంక్రాంతి సంబరాలు ఇంతటి భారీ విజయాన్ని అందించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు...

# జగ్గన్నతోట తీర్థం రాష్ట్ర పండుగ అనందాన్ని ఇచ్చింది...

- రెండు లక్షల మంది తరలి వచ్చారు...
- మంత్రి వాసంశెట్టి సుభాష్..

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, జనవరి17:** జగ్గన్నతోట తీర్థం రాష్ట్ర పండుగగా ముఖ్య మంత్రి ప్రకటించడం అనందం కలిగించిందని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.

అంబాజీపేట మండలం, మొసలపల్లి గ్రామం, జగ్గన్నతోట లో కన్నుల పండుగా జరిగిన ఏకాదశ రుద్రులు కొలువుతీరిన ప్రాంతంలో అత్యంత రమణీయంగా జరిగిన తీర్థ మహోత్సవానికి లక్షలాదిమంది భక్తులు శరభ..శరభ.. అచ్చరభ అంటూ ఆది దేవుని స్మరించుకుంటూ ఏదశ రుద్రులు ప్రభలను భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా

మంత్రి సుభాష్ మాట్లాడుతూ తీర్థ మహోత్సవం లో రెండు లక్షల మంది ఈ తీర్థానికి తరలి వచ్చారని, ఏకాదశ రుద్రుల సమ్మేళనం ఈ తీర్థం అని అన్నారు.

రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆంధ్రా గోవా బీచ్ ను కూడా రాష్ట్ర పండుగగా గుర్తించిందన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించడంలో కూటమి ప్రభుత్వం మొదటి చేయి అని బిజిపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ అన్నారు. అమలాపురం లో మెట్రో కేమ్ అధినేత ఎన్ వి రావు స్వగృహం లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో టిడిపి కోనసీమ ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, చిక్కాల గణేష్ యాళ్ల దొరబాబు, బిజెపి జిల్లా



అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, మోకా వెంకట సుబ్బారావు,నల్లా పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

**పెద్దాపురం, పెన్ పవర్, జనవరి 17 :** చట్టాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని పలువురు పేర్కొన్నారు. పెద్దాపురం పట్టణ పరిధిలోని మరిడమ్మ అమ్మవారి దేవస్థానం, జగ్గంపేట రహదారిలో గల సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, ప్యారా లీగల్ వాలంటీర్లు ప్రజలకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. సామాన్య ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలో నేరాలు తగ్గుముఖం పడతాయని, ప్రతీ ఒక్కరూ తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిరోధక చట్టం, మోటార్ వాహనాల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పలివెల చిన్న చంటి, పారా లీగల్ వాలంటీర్లు నూతలపాటి అప్పలకొండ, కుంచే నాని బాబు, కె.వి.వి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.




## మందపల్లిలో భక్తిశ్రద్ధల మధ్య శ్రీ మందేశ్వర స్వామి తైలాభిషేకాలు



**కొత్తపేట,పెన్ పవర్, జనవరి17;**కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలోని శ్రీ మందేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం భక్తుల శివనామ స్మరణలు, ఓంకార ధ్వనుల మధ్య తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి దర్శనార్థం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అభిషేకాలు, పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సేవల ద్వారా రూ.1,53,290 ఆదాయం లభించగా, అన్నప్రసాద విరాళాలుగా రూ.37,684, పరోక్ష పూజల ద్వారా రూ.99,200 సమకూరి మొత్తం రూ.2,90,174 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనరు, ఈఓ దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు. ఈ ఆదాయాన్ని ఆలయ నిత్య పూజలు, అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు వెల్లడించారు.

## షాహీ జామియా మసీదు కమిటీ అధ్యక్షుడుగా ముక్తార్ అలీ



**పెద్దాపురం, పెన్ పవర్, జనవరి 17:** పెద్దాపురం పట్టణ ముస్లిం అంజుమన్ వెల్ఫేర్ అసోసియేషన్, షాహీ జామియా మసీదు కమిటీ అధ్యక్షుడుగా మహమ్మద్ ముక్తార్ అలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక షాహీ జామియా మసీదులో శుక్రవారం జుమా నమాజ్ అనంతరం జరిగిన మహాజన సభలో ముక్తార్ ను అధ్యక్షుడుగా అంజుమన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముక్తార్ మాట్లాడుతూ పట్టణంలో ముస్లింల అభ్యున్నతికి అన్ని విధాల కృషి చేయడంతో పాటు వక్ఫ్ ఆస్తులను అందరి సహకారంతో పరిరక్షిస్తానన్నారు. అలాగే పట్టణంలో కొన్ని వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం చేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని వారిపై న్యాయ పోరాటం చేసేందుకు కమిటీ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

## శృంగార వల్లభ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



**పెద్దాపురం, పెన్ పవర్, జనవరి 17 :** పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొనేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వామి వారికి నిత్య కైంకర్యాలను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామి వారిని ఈరోజు సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 2,35,510/-, అన్నదాన విరాళాల ద్వారా రూ. 1,53,367/-, కేశ ఖండన ద్వారా రూ. 2,800/- తులాభారం ద్వారా రూ. 700/-, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 23,655/-, మొత్తం రూ. 4,16,032 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం, సుమారు పది వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ మొయిళ్ళ సంధ్య, ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జగ్గన్నతోట తీర్థాన్ని ప్రైవేటు స్థలంలో నిర్వహించి.....రాష్ట్ర పండుగ అంటారా....?

**అంబాజీపేట, పెన్ పవర్, జనవరి17:**జగ్గన్న తోట ప్రభల తీర్థాన్ని ఒక ప్రైవేటు స్థలంలో నిర్వహించి, రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో తొలిసారిగా ప్రభుత్వం తీర్థం నిర్వహించిన తీరు చూస్తే రాష్ట్ర పండుగ స్థాయిలో లేదని ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని వైకాపా స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు నేలపూడి స్టాలిన్ బాబు విమర్శించారు. శుక్రవారం జరిగిన తీర్థంలో భక్తుల సంఖ్య ఎక్కువ కావడంతో ఒక దశలో తొక్కిసలాట ఏర్పడే పరిస్థితులు ఏర్పడ్డాయని, పోలీసు యంత్రాంగం ఎంతగా వైఫల్యం చెందిందో గోచరిస్తున్నదని స్టాలిన్ బాబు అన్నారు. భక్తుల కార్లు, ద్విచక్ర వాహనాలను తీర్థం జరిగే ప్రదేశానికి కిలోమీటర్ల దూరంలో నిలిపివేశారని అయితే కొంతమంది విఐపిల కార్లను వంతెన పై పార్కింగ్ చేయడంతో తీవ్రమైన తోపులాట ఏర్పడిందన్నారు. తీర్థానికి హాజరైన లక్షలాదిమంది భక్తులకు కనీసం మౌలిక సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వయంత్రాంగం చొరవ చూపలేకపోవడం దురదృష్టకరమన్నారు. కేవలం మంచినీరు, బయో టాయిలెట్ లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారని స్టాలిన్ బాబు విమర్శించారు.



రాష్ట్ర పండుగగా ప్రకటించే ముందు తగిన గ్రౌండ్ వర్క్ చేయలేదన్న విషయం స్పష్టమవుతోందని, మొక్కుబడిగా రాష్ట్ర పండుగగా ప్రకటించారన్నారు. అత్యంత ముఖ్యంగా ఒక ప్రైవేటు వ్యక్తి స్థలంలో నిర్వహించే తీర్థాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించే ముందు ఆ స్థలాన్ని ప్రభుత్వమే సేకరించాల్సిందన్న మౌలిక విషయాన్ని పూర్తిగా విస్మరించారని, అంతే కాకుండా ఆర్థికపరంగా తగిన నిధులను కేటాయించి ఉత్సవ కమిటీలకు కార్యక్రమ నిర్వహణకు అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరించే విధంగా చర్యలు తీసుకొని ఉత్సవ కమిటీలకు ఉపశమనం కలిగించాలని స్టాలిన్ బాబు డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకుల ఆర్భాటంతో సామాన్య భక్తులకు అసౌకర్యాన్ని కల్పించారని ఆయన ధ్వజమెత్తారు.

## హరిదాసులు సనాతన హిందూ ధర్మ పరిరక్షకులు



**పెద్దాపురం, పెన్ పవర్, జనవరి 17 :** సనాతన హిందూ ధర్మ పరిరక్షణలో హరిదాసుల పాత్ర వెలకట్టలేనిదని హిందూ ధర్మ రక్షా సమితి సభ్యులు పేర్కొన్నారు. హిందూ ధర్మ రక్షా సమితి, గ్రామస్థుల ఆధ్వర్యంలో పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామంలో గల దబ్బలదిబ్బ వీధి రామాలయంలో హరిదాసుకు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా జగన్నాథపురానికి చెందిన హరిదాసు కొనపాకుల వేణుగోపాల్ ను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ రక్షా సమితి సభ్యులు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా మన సనాతన ధర్మాన్ని, సంస్కృతిని చాటిచెప్పే హరిదాసులను సత్కరించడం మన అదృష్టమన్నారు. హరిదాసు అనగా శ్రీ మహా విష్ణువుకి ప్రతిరూపమని, మనుషులు ఇచ్చే దానధర్మాలు అందుకొని వారికి ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు కలగాలని దీవించేవారు హరిదాసులని అన్నారు. యజ్ఞ యాగాదులు చేస్తే వచ్చే ఫలితం, హరిదాసులకు పెట్టే భిక్ష వల్ల లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయని, ఆధునిక కాలంలో ఈ కళ కనుమరుగవుతున్న తరుణంలో హరిదాసులను గౌరవించుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. హరిలో రంగ హరి’ అంటూ వైష్ణవ భక్తిని చాటుతూ గ్రామస్తులందరికీ శుభం కలగాలని ఆశీర్వదించే హరిదాసులు మన సంస్కృతికి సజీవ సాక్ష్యాలని కొనియాడారు. తెల్లవారుజామునే గంటానాదంతో నిద్రలేపి భక్తి పాటలతో ఆధ్యాత్మిక చైతన్యం నింపే వారిని గౌరవించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మారుతున్న కాలంలో ఇలాంటి కళాకారులు అరుదుగా కనిపిస్తున్నారని, మన పురాతన సంప్రదాయాలను కాపాడుకోవడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. హరిదాసుల కీర్తనలతో ఆ ప్రాంతమంతా భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. అనంతరం హరిదాసు శ్రీనివాస్ ను ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలు, బియ్యం, దక్షిణ తాంబూలాలను అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో హిందూ ధర్మ రక్షా సమితి సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# కనువిందు చేసిన ముగ్గుల పోటీలు

**పెద్దాపురం, పెన్ పవర్, జనవరి 17 :** మారుతున్న కాలంలో అంతరించిపోతున్న పల్లెటూరి కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని కట్టమూరు గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం (శివాలయం) వద్ద శనివారం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు అత్యంత ఉత్సాహంగా సాగాయి. పోటీదారులు ఉదయం నుంచి ఉత్సాహంగా తరలివచ్చి వివిధ రకాల ముగ్గులతో ప్రాంగణాన్ని అలంకరించారు. సాంప్రదాయ చుక్కల ముగ్గులు, గీతల ముగ్గులతో పాటు ప్రస్తుత పల్లెటూరి సంక్రాంతి శోభను ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రంగురంగుల రంగులతో, గొబ్బెమ్మలతో, పూల అలంకరణలతో ముగ్గులు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు, యువతులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ముగ్గుల్లోని సృజనాత్మకత, రంగుల కలయిక, ముగ్గు వేసిన శైలిని పరిగణనలోకి తీసుకుని న్యాయ నిర్ణేతలు ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా ఐ. బుజ్జి, బి. శ్రీకళ, బి. యమున దుర్గలను ఎంపిక చేసి ముఖ్య అతిథులు చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. అలాగే ఈ పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవనంలో అంతరించిపోతున్న కళలకు జీవం పోయాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ముగ్గులు వేయడం కేవలం అలంకరణ మాత్రమే కాదని, అది మన ఆచారాల్లోని ఒక గొప్ప శాస్త్రీయ కళ అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కందుల విశ్వేశ్వరరావు, నూనె రామారావు, దినేష్ రాజు, భువనాశి గంగాధర్, మేడిది శ్రీనివాస్, గుత్తుల సూర్యావతి శ్రీనివాస్, దిబ్బడి రాజబాబు, అడపా గంగాధర్, మార్ని మోహనరావు, నలమాటి రాంబాబు, బొడ్డు బాబురావు, చేవ సీతారామరాజు, అడపా రాజు, జి.వి.వి. వీర్రాజు, ఎలుగుబంటి శివ, కేశవ పట్టాభి రామస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## 80 వ జన్మదినశీ పురస్కరించుకుని చీరలు పంపిణీ



**గండేపల్లి, పెన్ పవర్, జనవరి, 17** మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన కుంచే రాజా మాతృమూర్తి కుంచే మాణిక్యంబ 80 వ జన్మదిన సందర్భంగా,మరియు సంక్రాంతి ని పురస్కరించుకుని శనివారం చీరలు పంపిణీ చేశారు.సూరంపాలెం, రామేశశీ పేట గ్రామానికి చెందిన సుమారు 500 మహిళలకు వైస్ ఎంపీపీ కుంచే రాజా చేతుల మీదుగా చీరలు అందజేశారు.ఈ కార్యక్రమంలో గోరింట అబ్బులు, తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్ శంకుస్థాపనకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**కాకినాడ పెన్ పవర్, జనవరి 17:**కాకినాడలో ఏర్పాటు చేయనున్న గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ హాజరయ్యేందుకు కాకినాడకు చేరుకున్నారు.ఈ సందర్భంగా హెలిప్యాడ్ వద్ద అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు, ఏఎం గ్రీన్ సంస్థ ప్రతినిధులు వారికి ఘనంగా స్వాగతం పలికారు.

రాష్ట్రంలో పర్యావరణ అనుకూలమైన పరిశ్రమల అభివృద్ధికి గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్ కీలకమైనదిగా భావిస్తున్న ప్రభుత్వం, ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉపాధి అవకాశాలు, పరిశ్రమల వృద్ధి, స్వచ్ఛమైన శక్తి వినియోగం పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తోంది.ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్ శంకుస్థాపనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

### హెలిప్యాడ్ వద్ద జిల్లా ఇంచార్జి కలెక్టర్ అపూర్వ భరత్ స్వాగతం

**కాకినాడ పెన్ పవర్,జనవరి17:**కాకినాడలో ఏర్పాటు చేయనున్న గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరయ్యేందుకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి హెలిప్యాడ్ వద్ద జిల్లా ఇంచార్జి కలెక్టర్ అపూర్వ భరత్ ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, ఏఎం గ్రీన్ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్రంలో పర్యావరణ హిత పరిశ్రమల అభివృద్ధికి గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్ కీలకమైనదిగా భావిస్తున్న ప్రభుత్వం,ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని,రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తోంది.



## హెల్పింగ్ హ్యాండ్స్ యువత సేవలు



**గండేపల్లి పెన్ పవర్, జనవరి, 17** గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో సత్తి సోమరాజు ఆర్పిఎఫ్ విశ్రాంతి రైల్వే ఉద్యోగి,ఉద్యోగశీలో ఉండగా పబ్లిక్ హాలిడేస్ లో డ్యూటీలో ఉన్నరోజులకు అదనంగా జనవరి నెలలో వచ్చే సెలవు వేతనం డబ్బులను తను పుట్టిన ఉప్పలపాడు గ్రామంలో వృద్ధులకు,వికలాంగులకు, వితంతువులకు సంక్రాంతి పండుగ రోజున కొత్త బట్టలు,స్వీటు ఇచ్చి వారితో పండుగ సంతోషాన్ని పంచుకుంటున్నారు.ఈసందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండర్ సత్తి సోమరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమం 2010 నుంచి సుమారు17 సంవత్సరాల నుండి నిరాటశీకముగాకొనసాగిస్తున్నామని ఇందుకు డబ్బులు రూపంలో, సేవరూపంలో,ఉద్యోగస్తులు సేవా భావం గల పెద్దల సహకారంతో గ్రామంలోవృద్ధులు,వికలాంగులు,పేదవారు మరియు వితంతువులకు కొత్త బట్టలు,అరకేజీ స్వీట్ బాక్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వారిని పేదలుగా కాకుండా మా ఆత్మీయులుగా భావించి వారి ఆశీర్వాదం పొందుతూ సంక్రాంతి పండుగ సంతోషాన్ని వీరితో పంచుకుంటున్నామని సంతృప్తిని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో సిరిదేళ్ళ శ్రీనివాస్,పి శ్రీను,యస్ కిరణ్,రమేష్,కె గోవింద్,పి చంటి,ప్రసాద్,ఎస్ కె తాతాజీ,ఆలీ,పీవి ప్రసాద్,దాసరి వెంకటేష్,పి శ్రీను ల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

# రోడ్డు నిర్మాణం కోసం మరోసారి నిరసన చేపట్టనున్న గిరిజనులు.



**ఏలేశ్వరం, పెన్ పవర్, జనవరి 17:** గిరిజన మండలాల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడంలో విఫలమవుతున్న ప్రభుత్వాల పనితీరును నిరసిస్తూ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ మరోసారి గిరిజనులు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఏలేశ్వరం మండలం రమణయ్య పేట గ్రామం నుండి జె. అన్నవరం వరకు గల సుమారు 11 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా పాడైపోయి మూడు దశాబ్దాల కాలం గడుస్తున్నప్ప టికీ పాలకులకు పట్టక పోవడం విచార కరమని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్య తీవ్రతను తెలియజేస్తూ భారీ ఎత్తున నిరవధిక నిరసన కార్యక్రమాలు నిర్వహించడానికి గిరిజనులు సమాయత్తమవుతున్నారు. ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు లోతా రామారావు

ఈ నెల 22 తేది నుండి ఆర్ అండ్ బి రహదారి నిర్మాణం కోసం ఉద్యమం చేపట్టనున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాల కాలంగా సుమారు 11 నుండి 15 కిలోమీటర్ల రోడ్డు లో ప్రయాణించే గిరిజనులు ఏలేశ్వరం చేరుకోవాలంటే అనేక ఇబ్బందులు పడుతూన్నారు. గర్భిణీ స్త్రీలు ఆసపత్రులకు చేరుకోవడానికి ప్రాణం అర చేతిలో పెట్టుకొని ప్రయాణించవలసి వస్తుంది ప్రయాణం చేయవలసి వస్తుంది. గిరిజన గ్రామాల నుంచి ఏలేశ్వరం చేరుకోవడానికి అష్ట కష్టాలు పడాల్సి వస్తుంది . ఆర్ టి సి బస్సులు ఆ గోతుల్లో పడి, ఏదో ఒక పార్ట్ విరిగిపోవడం, తద్వారా బస్సు నిలిచిపోవడం జరగడం తో అందులో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, ప్రైవేటు వాహనాలు యాక్సిడెంట్లకు గురై ప్రయాణికులు ఆసుపత్రుల పాలవుతున్నారు. ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా ఏ ఒక్క అధికారి గాని ,ప్రజా ప్రతినిధి గాని పట్టించు పోవడం లేదని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. దీనితో గిరి జనం లో చైతన్యము కట్టలు తెంచుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలవేళలో తాము అధికారంలోకి వస్తే రోడ్డు నిర్మాణం పనులు వెంటనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చి , అధికారంలోకి వచ్చిన వెంటనే నాయకులు మొహం చాటేస్తున్నారు. ఈ సమస్యపై అనేకమంది ప్రతిపక్ష నాయకులు, సిపిఐ, సిపిఎం పార్టీ ప్రతినిధులు విద్యార్థుల తోపాటు ఆదివాసి గిరిజన సంఘం నాయకులు 10 ఏళ్లలో ఎన్నో పోరాటాలు చేశామని ఆ ప్రకటనలో తెలిపారు. లోతా రామారావు నేతృత్వం లో ఈనెల 22 తేదిన రమణయ్యపేట నుండి జె.అన్నవరం వరకు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణం కోసం గిరిజనుల్లో విప్లవ పోరాటం రాష్ట్రస్థాయి నుండి కేంద్ర స్థాయి వరకు జరిగే విధంగా ఈ పోరాటం మొదలవు తుందని ఒక ప్రకటనలో గిరి జనం తెలిపారు. పాడేరు జిల్లా రాజవొమ్మంగి, అడ్డతీగల , వైరామవరం అల్లూరి జిల్లా కొయ్యూరు కేడీపేట గోలకొండ నర్సీపట్నం వంటి మండలాల ప్రజాప్రతినిధులు అన్ని పార్టీల రాజకీయ నాయకులు, ఆదివాసి సంఘాల నాయకులు ప్రజా సంఘాలు ఈ పోరాటంలో పాల్గొని మద్దతు ఇవ్వాల్సిందిగా ఆ ప్రకటన కోరారు.

## దళిత యువకుడి హత్యపై వై.యస్.ఆర్ సీపీ ఆగ్రహం..




**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 17:** అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఈదరపల్లి లోని డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం ,నిర్వహించారు.

పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామంలో దళిత యువకుడు మందా సాల్మన్‌ను పాశవికంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ శనివారం వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తింది... ఈ నిరసన కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షులు,చిర్ల జగ్గిరెడ్డి ,మాజీ మంత్రి,అమలాపురం నియోజకవర్గం పార్లిమెంట్ కో-ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ , అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ నాయకత్వం వహించారు... ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొమ్మి ఇశ్రాయేల్ ,కుడుపూడి సూర్యనారాయణ రావు, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ , రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు ,వంటెద్దు వెంకన్నాయుడు,, పితాని బాలకృష్ణ, కుడుపూడి బాబు,ఇళ్ల శేష గిరి రావు, మట్టపర్తి నాగేంద్ర ,జాన గణేష్, సరెళ్ల రామకృష్ణ,గుత్తుల సత్తిబాబు, చేట్ల రామారావు, నాతి శ్రీనివాస్, ఉండ్రు బాబ్జి, దంగేటి వెంకటాశెట్టి, దొమ్మేటి బాబ్జి, నాయకులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు...

## వయోవృద్ధులకు చీరలు, దుస్తులు పంపిణీ



**కిర్లంపూడి /ప్రత్తిపాడు, పెన్ పవర్, జనవరి 18:** ప్రత్తిపాడు శారద వయోవృద్ధాశ్రమంలో వైసీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు సకురు గుర్రాజు పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన చీరలు, దుస్తులను సకురు గుర్రాజు చేతుల మీదుగా వృద్దులకు అందజేశారు. ఈ సందర్భంగా గుర్రాజు మాట్లాడుతూ సమాజంలో వృద్ధులు ను ఆదుకుని గౌరవించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. వృద్ధాశ్రమంలో ఉన్న నిరుపేదలను తమ వంతు సహాయంగా ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది లింగంపల్లి శివ,సకురు సూరాజ్, గుర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్--గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్

* ఏపీలోఏఎం గ్రీన్ ప్లాంట్ శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రసంగం



**కాకినాడ స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, జనవరి 17:** ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్ మన ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు కావడం ఎంతో సంతోషకరమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కాకినాడ గ్రామీణ ప్రాంతంలో ఏఎం గ్రీన్ హైడ్రోజన్--గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా 30 లక్షల మందికిపైగా ఏపీ ప్రజలు స్వస్థలాలకు వచ్చారని, హైదరా బాద్ నుంచి మాత్రమే 3 లక్షల వాహనాలు రాష్ట్రానికి వచ్చినట్లు సీఎం తెలిపారు. జగ్గన్నతోట ప్రభల తీర్థం ఉత్సవాలు అద్భుతంగా నిర్వహించారని పేర్కొన్నారు. గత ఏడాది ఈ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చామని, 2027 జూన్ నాటికి 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ప్రారంభమవుతుందని తెలిపారు. కాకినాడ నుంచి జర్మనీకి గ్రీన్ అమ్మోనియా సరఫరా చేయనున్నట్లు చెప్పారు. గతంలో నాగార్జునా ఫెర్టిలైజర్స్ గ్రే అమ్మోనియా తయారు చేసిన ప్రాంతంలోనే ఇప్పుడు పర్యావరణ హితమైన గ్రీన్ అమ్మోనియా తయారీ జరగనుందని తెలిపారు. పర్యావరణ సమతుల్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రకృతి విపత్తులు, సముద్ర మట్టాల పెరుగుదల వల్ల భూమి కోతకు గురవుతోందని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించారని, ఆ దిశగా ఏపీ 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యాన్ని పెట్టుకుందని చెప్పారు. సమీప భవిష్యత్తులో ఏపీ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇళ్లపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకుని ప్రజలు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని,వినియోగదారులు ఇప్పుడు “ప్రోజ్యూమర్లు”గా మారారని సీఎం తెలిపారు. వెయ్యి కిలోమీటర్ల తీరరేఖలో 20 పోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సౌర, పవన, జల విద్యుత్, పంప్డ్ స్టోరేజీ, గ్రీన్ హైడ్రోజన్,గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి ఏపీ అత్యంత అనుకూల రాష్ట్రమని పేర్కొన్నారు. ఏఎం గ్రీన్ సంస్థ ప్లాంట్ ద్వారా గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా, ఇథనాల్, గ్రీన్ మాలిక్యూల్స్ ఉత్పత్తి కానున్నట్లు తెలిపారు. కాకినాడలోనే 2 గిగావాట్ల సామర్థ్యంతో ఎలక్ట్రోలైజర్స్ తయారీకి నిర్ణయం తీసుకోవడంఅభినందనీయమన్నారు. ఏపీ క్లీన్ , గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ పాలసీ 2024 దేశంలోనే అత్యుత్తమ విధానమని తెలిపారు. పారిశ్రామిక రంగానికి అనుకూల విధానాలతో పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని, ఒక్క నిమిషం కూడా ఆలస్యం లేకుండా అనుమతులు ఇస్తున్నామని స్పష్టం చేశారు. గ్రీన్ అమ్మోనియా ప్రకృతి సేద్యానికి కూడా ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఎరువుల అధిక వినియోగం వల్ల నీటిలో నైట్రోజన్ స్థాయిలు పెరిగాయని, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తితో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా అభివృద్ధి, సంపద సృష్టి, సంక్షేమం జరగాలని సీఎం అన్నారు. 18 నెలల్లో “సూపర్ సిక్సు పథకాలను విజయవంతం చేశామని, విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయని తెలిపారు. విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే యూనిట్‌కు 29 పైసల మేర భారం తగ్గించామని చెప్పారు. విశాఖలో 1 గిగావాట్ సామర్థ్యంతో ఏఐ గిగా సెంటర్ ఏర్పాటు చేసేందుకు గూగుల్ ముందుకొచ్చిందని, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, క్వాంటం వ్యాలీ ప్రకటించామని తెలిపారు. అమరావతిలో త్వరలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. స్పేస్ టెక్నాలజీ రంగంలో కూడా రాష్ట్రం ముందుకు సాగుతుందని, ఆంధ్రప్రదేశ్ నాలెడ్జ్ ఎకానమీకి కేంద్రంగామారుతుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. 2029--30 నాటికి ఈ ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అత్యుత్తమంగా మారాలని ఆకాంక్షిస్తూ, రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## జిల్లా కోర్టు పరిధిలో మూడు కేటగిరీల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫ్రంట్ ఆఫీస్ కో--ఆర్డినేటర్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం**

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత**

**రాజమహేంద్రవరం/కాకినాడ, పెన్ పవర్, జనవరి 17:** జిల్లా కోర్టు పరిధిలో డివిజన్-- కు చెందిన మూడు కేటగిరీల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫ్రంట్ ఆఫీస్ కో--ఆర్డినేటర్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులకు ఒక్కో ఖాళీ చొప్పున భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ (కేటగిరీ--3)డివిజన్-- లోని కేటగిరీ--3 డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు ఓపెన్ కేటగిరీలో 01 ఖాళీ ఉంది. వేతన శ్రేణి రూ.28,280/- నుండి రూ.89,720/- వరకు ఉంటుంది.

అభ్యర్థులు డిగ్రీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, టైపింగ్ నైపుణ్యం కలిగి ఉండాలి. ఎంఎస్ ఆఫీస్/లైబ్రేరియన్ ఆఫీస్, వెబ్ బ్రౌజింగ్‌లో కనీసం మూడు సంవత్సరాల అనుభవం అవసరం. 08-02-2026 మధ్యాహ్నం 1.00 గంటలకు రాజమహేంద్రి డిగ్రీ ౘ పీజీ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో రాత పరీక్ష, 12-02-2026 ఉదయం 10.00 గంటలకు జిల్లా కోర్టు, రాజమహేంద్ర వరంలో కంప్యూటర్, టైపింగ్, డేటా ఎంట్రీ నైపుణ్య పరీక్ష నిర్వహించ బడుతుంది. ఫ్రంట్ ఆఫీస్ కో--ఆర్డినేటర్ (కేటగిరీ--4(డి))డివిజన్-- లోని కేటగిరీ--4(డి) ఫ్రంట్ ఆఫీస్ కో--ఆర్డినేటర్ పోస్టుకు ఓపెన్ కాంపిటిషన్ కింద 01 ఖాళీ ఉంది. వేతన శ్రేణి రూ.25,220/- నుండిరూ.80,910/- వరకు ఉంటుంది. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ పూర్తి చేసి, కంప్యూటర్ పరిజ్ఞానం, ఎం.ఎస్ ఆఫీస్/లైబ్రేవెబ్ బ్రౌజింగ్‌లో అనుభవం ఉండాలి.

08-02-2026 సాయంత్రం 3.30 గంటలకు రాత పరీక్ష, 13-02-2026 మధ్యాహ్నం 2.30 గంటల నుంచి జిల్లా కోర్టు, రాజమహేంద్రవరంలో వైవా--వోస్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. రికార్డ్ అసిస్టెంట్ (కేటగిరీ--5)డివిజన్-- లోని కేటగిరీ--5 రికార్డ్ అసిస్టెంట్ పోస్టుకు ఓపెన్ కేటగిరీలో 01 ఖాళీ ఉంది. వేతన శ్రేణి రూ.23,120/- నుండి రూ.74,770/- వరకు ఉంటుంది. అభ్యర్థులు ఎస్.ఎస్.సి లేదా సమాన అర్హత కలిగి ఉండాలి. 08-02-2026 ఉదయం 10.00 గంటలకు రాత పరీక్ష, 12-02-2026 మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా కోర్టు, రాజమహేంద్ర వరంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. వయో పరిమితి ౘ రిజర్వేషన్లు 01-01-2026 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుండి 42 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు, ఎక్స్--సర్వీస్‌మెన్‌కు నిబంధనల ప్రకారం వయో సడలింపు వర్తిస్తుంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రిజర్వేషన్లు అమలు చేయబడతాయి. న్యాయ జిల్లా క్యాడర్ పోస్టులలో 80 శాతం స్థానికులకు, 20 శాతం ఇతరులకు అవకాశం ఉంటుంది. సంబంధిత నియమ నిబంధనలు, దరఖాస్తు నమూనా నోటిఫికేషన్ ద్వారా విడుదల చేయబడినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు.

## ఎంపీడీవో ఆధ్వర్యంలో పెన్ పవర్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాసమస్యలకు అక్షరాల తూటాలు -- పెన్ పవర్ ప్రత్యేకత**



**కాజులూరు, పెన్ పవర్, జనవరి 17:** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జే. రాంబాబు ఆధ్వర్యంలో పెన్ పవర్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పెన్ పవర్ తెలుగు దినపత్రిక క్యాలెండర్‌ను తన చేతులమీదుగా ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

పెన్ పవర్ అంటే టైటిల్‌కు తగ్గట్టుగానే వార్తా కథనాలు ఉంటాయని ప్రశంసించారు. “ప్రతి కథనం అక్షర సత్యం” అంటూ, పెన్ పవర్ నిత్యం ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాస్తవాధారిత వార్తలను అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమవుతూ, సంచల నాత్మకమైనా బాధ్యతాయుతమైన కథనాలతో ముందుకు సాగుతున్న పెన్ పవర్ దినపత్రిక తనదైన శైలిలో నడవడం గర్వకారణమని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా, అధికారులు కూడా ఆసక్తిగా చదివే విధంగా వార్తలను అందించడంలో పెన్ పవర్ తన సత్తా చాటుకుంటోందని తెలిపారు. అవగాహన కల్పించే కథనాలతో సమస్యల పరిష్కార దిశగా కృషి చేయాలని సూచిస్తూ, పెన్ పవర్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. సమస్యలపై తూటాల్లాంటి అక్షరాలతో ప్రజల మధ్యకు చేరువవుతూ, సమాజంలో మార్పుకు దోహదపడుతున్న దినపత్రికగా పెన్ పవర్ గుర్తింపు పొందిందన్నారు. నిజాయితీతో కూడిన కథనాలే పెన్ పవర్ ప్రత్యేకత అని, ప్రత్యేక కథనాల ద్వారా సమాజానికి దిశానిర్దేశం చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలపరుస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలకు మరిన్ని అవగాహనాత్మక, చైతన్యవంతమైన కథనాలు అందిస్తూ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, పెన్ పవర్ యాజమాన్యానికి, పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చక్రపాణి, ఏవో పద్మలత, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి ఉత్సవాలు.



**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 17;** మండల కేంద్రమైన ఆలమూరులో శనివారం వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద శ్రీకృష్ణదేవరాయల జయంతి ఉత్సవాలు డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు 1509 నుండి 1529 సంవత్సరం వరకు విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన గొప్ప చక్రవర్తి అని, భారతీయ చరిత్రలో అత్యంత ముఖ్యమైన పాలకుల్లో ఒకరిని, ఆయన కాలంలో సామ్రాజ్యం వైభవాన్ని చూసిందని, ప్రజలంతా ఆనందంగా ఉండేవారని డాక్టర్ చల్లా అన్నారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి,పేదలకు,వృద్ధులకు, దివ్యాంగులకు వస్త్ర దానం చేసారు. అక్కడ నుంచి భారీ ర్యాలీతో బయలుదేరి ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లకు పళ్ళు,రొట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో సలాది రామకృష్ణ, తమ్మన శ్రీనివాసు,గొర్రిపూడి పెద్దకాపు,చల్లా నానాజీ, రామానుజుల శేషగిరిరావు,చల్లా భూషణం,చల్లా బాబి, తదితర కాపు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## సబ్ జైలును ఆకస్మిక తనిఖీ నిర్వహించిన ప్రత్తిపాడు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జనవరి 18:** మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,ప్రత్తిపాడు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జ్ ఎల్ గోపీనాథ్ ప్రత్తిపాడు సబ్ జైలును శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఖైదీలకు అందుతున్న వసతుల గురించి ఆరా తీసారు. ఈ సందర్భంగా సబ్ జైలులో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని సిబ్బందిని, అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బంది లేదని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేసారు. ఫిర్యాదులు పెట్టెను తెరిచి చూసారు. వంటకు ఉపయోగించు పప్పులను పరీక్షించినారు. ఈ కార్యక్రమంలో పానెల్ అడ్వకేట్ మల్లేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్ షణ్ముఖ శ్రీ సబ్ జైల్ సిబ్బంది పాల్గొన్నారు

## సీఎం, డిప్యూటీ సీఎంలకు స్వాగతం పలికిన జగ్గంపేట ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు



**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 17**: కాకినాడలో నిర్మించతలపెట్టిన ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్ అండ్ గ్రీన్ అమోనియా కాంప్లెక్స్ స్థాపనోత్సవానికి కాకినాడ విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ స్వాగతం పలికారు. హెలిపాడ్ వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికి మాట్లాడారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ వంటి భారీ పరిశ్రమ రావడం యువతకు ఎంతో మేలు చేస్తుందన్నారు. దీని ద్వారా యువతకు వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

## గుండెపోటుతో ప్రయాణీకరాలు మృతి

**కాట్రేనికోన పెన్ పవర్ జనవరి 17:** కాట్రేనికోన మండల పరిధిలో లక్ష్మీవాడ గ్రామానికి చెందిన తిరుపతి రమణ కుమారి(43) ఆర్ టి సి బస్సులో ప్రయాణిస్తూ గుండెపోటుతో మృతి చెందారు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం భీమవరం ఓ ప్రవేటు ఆసుపత్రికి వెళ్ళారు,వైద్యం అనంతరం అక్కడ నుంచి తిరిగి వస్తుండగా అమలాపురం నుండి పల్లం వెళుతున్న ఆర్ టి సి బస్సులో శనివారం రాత్రి మార్గ మధ్యలో చెయ్యేరులో గుండెపోటుతో మృతి చెందినట్లు ప్రయాణికులు తెలిపారు,వైద్య పరీక్షలు కోసం వెళ్లి మృతి చెందడంతో లక్ష్మీవాడ గ్రామంలో విషాద ఛాయలు అలుము కున్నాయి,కుటుంబ సభ్యులను సర్పంచ్ చొల్లంగి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర రావు, తదితరులు పరామర్శించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# జనార్ధన స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తజనం

**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 17;**నారద ప్రతిష్టిత నవ జనార్ధన ఆలయాల్లో ప్రముఖమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధన స్వామి వారి ఆలయానికి భక్తజనం పోటెత్తారు. వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులందరికీ ఆలయ అర్చకులు స్వామివారి దర్శనానంతరం వారందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ వైశిష్ట్యాన్ని, క్షేత్ర మహిమను వివరించారు.



## పిన్నెల్లిలో జరిగిన వైయస్ఆర్‌సీపీ కార్యకర్త సాల్మన్ హత్యాకాండను తీవ్రంగా ఖండించిన మాజీ ఎంపీ చింతా అనురాధ



**అల్లవరం,పెన్ పవర్, జనవరి 17:**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సంక్షేమం,అభివృద్ధిని మరిచి తమ ప్రాణాల రక్షణ గురించే భయపడే పరిస్థితి నెలకొందని అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీమతి చింతా అనురాధ ఆవేదన వ్యక్తం చేశారు.పల్నాడు జిల్లా పిన్నెల్లిలో జరిగిన వైయస్ఆర్‌సీపీ దళిత కార్యకర్త మందా సాల్మన్ హత్యకు వ్యతిరేకంగా,అమలాపురం ఈదరపల్లిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జిల్లా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి తో కలిసి చింతా అనురాధ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ, టీడీపీ గూండాలు ఇనుప రాడ్లతో చేసిన దాడిలో తీవ్రంగా గాయపడి, ఆరు రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాల్మన్ మృతి చెందడం అత్యంత హృదయవిదారకమని పేర్కొన్నారు.ఇంతటి ఘోర ఘటనలో కూడా పోలీసులు బాధితుడిపైనే కేసు నమోదు చేయడం కంటే అన్యాయం మరొకటి లేదని ఆమె మండిపడ్డారు. చివరకు సాల్మన్ మృతదేహానికి నివాళులు అర్పించేందుకు కూడా వైయస్ఆర్‌సీపీ శ్రేణులను అనుమతించకపోవడం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుకి ప్రత్యక్ష ఉదాహరణ అని తీవ్రంగా విమర్శించారు.బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు
మందా సాల్మన్ హత్య కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించాలి
నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి బాధిత కుటుంబానికి కనీసం రూ.50 లక్షల పరిహారం మరియు కుటుంబ సభ్యుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి.రాష్ట్రవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి
ఇది ఒక్క సాల్మన్ కుటుంబ పోరాటం కాదు -- రాష్ట్రంలోని దళిత, బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవ పోరాటమని, రాజ్యాంగ పాలన తిరిగి నెలకొనే వరకు మా పోరాటం ఆగదు" అని అనురాధ స్పష్టం చేశారు.వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి సహా పార్టీ మొత్తం సాల్మన్ కుటుంబానికి అండగా నిలుస్తుందని ఆమె భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ గారు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ పినిపే శ్రీకాంత్ , గన్నవరపు శ్రీను పితాని బాలకృష్ణ , పాముల రాజేశ్వరి , పాముల రాజా , చెల్లుబోయిన శ్రీను , వంటెద్దు వెంకన్ననాయుడు , నాగిరెడ్డి గారు, కుడుపూడి బాబు గారు, కటకంశెట్టి ఆదిత్య గారు, కొనుకు గౌతమి గారు, ఇళ్ల శేషారావు , రాపాక విజయలక్ష్మి ప్రజా ప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు సిటిజన్ సంస్థ అండ





✷ పిడత మామిడి గ్రామంలో పరామర్శించిన డా. నిడమర్తి చినబాబు

**గంగవరం, పెన్ పవర్, జనవరి 15 :**గంగవరం మండలం పిడత మామిడి గ్రామంలో ఈ నెల 12వ తేదీ సోమవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో నివాసాలు కోల్పోయిన కుటుంబాలను సిటిజన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పరామర్శించారు. సిటిజన్ సంస్థ చైర్మన్, ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నిడమర్తి చినబాబు నేతృత్వంలో బాధిత కుటుంబాలకు నూతన వస్త్రాలు, బియ్యం, కిరాణా సామాన్లు, కూరగాయలు అందజేశారు. ఈ సందర్భంగా డా. చినబాబు మాట్లాడుతూ, అగ్ని ప్రమాదంలో మూడు తాటి ఆకులతో నిర్మించిన పూరి గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపారు. బాధిత కుటుంబాలన్నీ ఎస్సీ మాదిగ కులానికి చెందినవని, ఏజెన్సీ ప్రాంతాల్లో మాదిగల జీవన పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు పూర్తిగా అందక, రెక్కల కష్టంతో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దళితులు ఇలాంటి ప్రమాదాల వల్ల పూర్తిగా రోడ్డున పడుతున్నారని అన్నారు.
గత రెండేళ్ల క్రితం గంగవరం మండలం రాజవరం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదు కుటుంబాలు ఇప్పటికీ సరైన ఇల్లు, ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నాయని గుర్తు చేశారు. ఆ సంఘటన మరువక ముందే ఇదే మండలంలో మరోసారి ఇలాంటి దుర్భర పరిస్థితి ఎదురవడం బాధాకరమని పేర్కొన్నారు.ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వంతో పాటు సమాజంలో ఉన్న దాతలు ముందుకు వచ్చి బాధితులను ఆదుకోవాలని, అలాగే బాధిత కుటుంబాలకు తక్షణమే నూతన గృహాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిటిజన్ సంస్థ కార్యదర్శి సుజాత, సభ్యులు మోర్త లాజరు, బీజేపీ రైతు మోర్చా జిల్లా కమిటీ సభ్యులు అడబాల దొరబాబు, మంచాల ప్రసాద్ కుమార్, సందీప్ కిరణ్, అనిప సుప్రజా తదితరులు పాల్గొన్నారు.

# సాటిలైట్ సిటీ రాజీవ్ గృహ వాంబే గృహాలలో పారిశుధ్యం అధ్వానం

✷ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై బిజెపి నాయకులు విమర్శ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 17:**రాజమహేంద్రవరం రూరల్ సాటిలైట్ సిటీ గ్రామపంచాయతీ పరిధిలోని వాంబే గృహాలు (రాజీవ్ గృహాలు) దుర్భర పరిస్థితుల్లో మలుగుతున్నాయని భారతీయ జనతా పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. బిజెపి నిర్వహిస్తున్న "జనతా వారధి" కార్యక్రమానికి శాటిలైట్ సిటీ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు, మండల అధ్యక్షులు మట్టా నాగబాబు ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపీ శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, మండల నాయకులు కలిసి వాంబే గృహాల ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డి బ్లాక్ పరిధిలోని 80 బ్లాకులు, 960 ప్లాట్లతో ఉన్న ఈ కాలనీలో అడుగడుగునా మౌలిక సమస్య లు ఎన్నో కనిపించాయని తెలిపారు. గత ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని ఐదేండ్లు పూర్తిగా విస్మరించడంతో పరిష్కరించలేని స్తితికి సమస్యలు చేరాయన్నారు. బ్లాక్‌ల వెనుక బిల్డింగ్ ల మధ్య దుర్భర, దుర్గంధ వాతావరణం నెలకొందని, చెత్త , మురుగునీరు పేరుకుపోయి మంచినీటి వాటర్ పైపుల నుంచి లీక్ అవుతు నీరు కలుషిత మవుతుందని అపార్ట్మెంట్ల మధ్య మురుగు చెరువులు తలపిస్తున్నాయిని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాలుగా భరించలేని దుర్వాసన వచ్చి పూర్తిగా శిథిలావస్థకు చేరి, పరిసరాలు తీవ్రంగా దుర్గంధభరితంగా మారాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారన్నారు. పైపుల లీకేజీల వల్ల త్రాగునీరు కలుషితం అవుతుండగా, గోదావరి నీటిని సరఫరా చేయాల్సిన అవసరం అత్యవసరంగా ఉందన్నారు.
కొన్ని బిల్డింగ్‌ల పునాదుల చుట్టూ గోడలు కూలిపోతూ, మట్టి ,మురుగు కాలువల్లోకి చేరుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. అనేక బ్లాకుల్లో నివాసాలు ఖాళీ అవుతుండటంతో, ఆసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. అశుభ్రమైన పరిసరాలు కారణంగా దోమలు, పందులు విపరీతంగా పెరిగి, మలేరియా, కలరా, డెంగు వంటి విషజ్వరాలు ప్రబలుతున్నా సంబంధిత పంచాయతీ, మండల అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని బిజెపి నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలాసార్లు రాజీవ్ గృహల సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పట్టించుకోలేదని వారు విమర్శించారు. ఈ ప్రాంత ప్రజలు 95 శాతం మంది పేద, కూలీ, కార్మిక వర్గాలకు చెందినవారు కావడంతో, వారి సమస్యలను పరిష్కరించడానికి పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. రాజీవ్ వాంబే కాలనీ గృహకల్ప ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో పరిశీలించామని , సంవత్సరాలుగా వాంబే గృహవాసులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితికి బాధ్యులైన అధికారులను బదిలీ చేయాలని, ప్రజారోగ్యాలతో చెలగాటమాడుతున్న స్థానిక అధికారుల నిర్లక్ష్యంపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. శాటిలైట్ సిటీ ప్రజల సమస్యలను సంబంధిత జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు బిజెపి నేతలు అండగా నిలుస్తామని వారు స్థానిక మహిళలకు హామీ ఇచ్చారు. జిల్లా ఉన్నత అధికారులు తక్షణమే ఈ ప్రాంతంలో పర్యటన చేయాలని, బిల్డింగ్ ల మధ్య చెత్తా ,మురుగు తొలగించాలని , సీసీ పనులు నిర్వహించాలన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న పురాతనమైన మంచినీటి పైపులను మార్చాలని, ప్రత్యేక బడ్జెట్ కేటాయించి , త్రాగునీరు పైప్ లైన్లను , మురుగు కాల్వలను మెరుగుపరచాలన్నారు. బిల్డింగ్ లు అన్ని ఆధునీకరించాలి. గ్రూప్ హౌస్ మెయింటెనెన్స్ పై హౌసింగ్ బోర్డు అవగాహన సమావేశాలు నిర్వహిం చాలని, పై అన్ని అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు.ఈ కార్యక్రమంలో మన్నెం శ్రీనివాస్, మజ్జి సాయి, పబ్బిత్ సతీష్, అన్నబత్తుల సాంబయ్య, కర్రి హరి, అత్తిలి సోమేశ్వరరావు, మిర్బని శివకుమార్ తదితర స్థానిక నాయకులు బిజెపి మండల జిల్లా నాయకులు పాల్గొన్నారు



## సార్లంక అగ్ని బాధితులకు రంపచోడవరం జనసేన నాయకులు చేయూత ..



**అడ్డతీగల, పెన్ పవర్, జనవరి17:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని సార్లంక గిరిజన గ్రామంలో 52 ఇల్లు వంట గ్యాస్ లీక్ అవడంవల్ల ఇల్లు మొత్తం కాలిపోవడం జరిగింది. దీనితో 52 గిరిజన కుటుంబాలు నిలువ నీడ కూడా లేకుండా నిరాశ్రయులయ్యారు. ఈ విషయం తెలిసిన వెంటనే రంపచోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు మరియు చేనేత సంఘం పోలవరం జిల్లా అధ్యక్షులు పసగడుగుల. గోపికృష్ణ స్పందించి బాధితులకు బియ్యం, కూరగాయలు,దుప్పట్లు, పళ్ళు, నిత్యవసర సరుకులు గోపికృష్ణ ఆధ్వర్యంలో బాధితులకు అందజేశారు . కూటమి ప్రభుత్వం ఎప్పుడు వారికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు రామిరెడ్డి, కోదండ వాసవి,గ్రామస్తులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు చేయూత

సార్లంక గ్రామంలో మహిళలకు చీరలు, నగదు పంపిణీ




**రంపచోడవరం పెన్ పవర్ జనవరి 17:**రౌతులపూడి మండలం సార్లంక గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన బాధిత కుటుంబాలకు ఆశ్రమ ఉన్నత పాఠశాల -- ముసురుమిల్లి ప్రధానోపాధ్యాయులు ఎం. బాలరాజు మానవతా దృక్పథంతో సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా ఆయన సుమారు 5 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి గ్రామాన్ని సందర్శించి,అగ్నిప్రమాదంలో నష్టపోయిన గ్రామంలోని ప్రతి మహిళకు ఒక చీరతో పాటు రూ.500 నగదును పంపిణీ చేశారు.ఈ సేవా కార్యక్రమంలో మోహనపురం సీఆర్ఎమ్‌టీ శివ, ఓగిపాలెం యూత్ ప్రెసిడెంట్ జగదీష్ రెడ్డి కలిసి పాల్గొని మొత్తం సుమారు రూ.40,500 విలువైన సహాయాన్ని బాధితులకు అందజేశారు.
అగ్నిప్రమాదంతో నిరాశలో ఉన్న బాధిత కుటుంబాలకు ఈ సహాయం కొంత ఊరటనిచ్చిందని గ్రామస్తులు తెలిపారు. మానవతా విలువలతో ముందుకు వచ్చిన బాలరాజు సహా దాతలను గ్రామ ప్రజలు కృతజ్ఞతలతో అభినందించారు.

## జాతీయ రోడ్డు భద్రత పై ఆటో రిక్షాలపై పోస్టర్లను అతికించిన రవాణా శాఖ




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 17:**జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం 2026 కార్యక్రమంలో భాగంగా నగ రంలోని లాలాచెరువు ట్రాఫిక్ జంక్షన్ వద్ద సుమారు 200 ఆటో రిక్షాలపై శనివారం రహదారి భద్రతా అవగాహన పోస్టర్లను అతికించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవాణా అధికారులు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు సి. హెచ్. సంపత్ కుమార్, ఎమ్. రవి కుమార్, జి. రామ్ నారాయణ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు జి. ప్రణీత్ కుమార్, జి. రాధిక దేవి, పి.వి.వి.డి.సాయి కుమార్ పలువురు పాల్గొన్నారు.

## అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ సత్కరించిన గొర్రెల శ్రీధర్



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జనవరి 17.**అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మినారాయణ తాడేపల్లిగూడెం పట్టణం లో గల రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ నివాసం లో కనుమ పండుగ సందర్భంగా నాగలిని భుజానికెత్తుకొని సందడి చేశారు సంక్రాంతి నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లాకు విచ్చేసిన అంబికా లక్ష్మినారాయణ గతంలో తెలుగుదేశం పార్టీ పరిశీలకుడిగా అనంతపురం జిల్లాలో గొర్రెల శ్రీధర్ పనిచేసిన నేపద్యం లో వారితో ఏర్పడిన పరిచయం తో గొర్రెల శ్రీధర్ నివాసానికి రావడం జరిగింది ఈ సందర్భంగా గొర్రెల శ్రీధర్ శాలువాతో సత్కరించి ఎడ్లబండి తో ఉన్న రైతున్న మోమెంటో ఇచ్చి సత్కరించడం జరిగింది అనంతరం విశ్వదుర్గేశ్వరి అమ్మ వారిని దర్శినం చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు పాతూరి రాంప్రసాద్ చౌదరి, తాడేపల్లిగూడెం పట్టణ తెలుగు యువత అధ్యక్షులు ఎరుబండి సతీష్, గొర్రెల శ్రీధర్ మిత్ర బృందం మరియు యువసేన సభ్యులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

# నితీష్ రెడ్డి అసలు ఆల్ రౌండరే కాదు: తెలుగు క్రికెటర్‌పై మహ్మద్ కైఫ్ షాకింగ్ కామెంట్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డిపై భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. నితీష్ కుమార్ రెడ్డి ఆల్ రౌండర్ కాదని.. అతను కేవలం బ్యాట్స్?మెన్ మాత్రమేనని అన్నాడు. బీసీసీఐ ఈ విషయాన్ని ఎంత త్వరగా అర్థం చేసుకుంటే వారికి అంత మంచిదని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆల్ రౌండర్ పేరుతో నితీష్ జట్టులో టీమ్ సెటప్ సరిగ్గా లేక కెప్టెన్?కు కంపర్టబుల్?గా ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశాడు. టీమ్?లో అతడు ఆరవ బౌలర్ కాదని.. నిజానికి అతనొక పార్ట్ టైమ్ బౌలర్ అని అభివర్ణించాడు. అసలు జట్టులో నితీష్ రెడ్డి పాత్ర ఏంటో నాకు అర్థం కావడం లేదని.. టీమిండియా కోచ్, మేనేజ్‌మెంట్ దయచేసి టీమ్?లో అతడి పాత్ర ఏంటో తనకు చెప్పాలని కోరాడు. రాజ్?కోట్ వేదికగా న్యూజిలాండ్?తో జరిగిన రెండో వన్డేలో టీమిండియా ప్లేయింగ్ లెవన్ ఎంపికపైన కైఫ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. నెమ్మదిగా ఉన్న రాజ్‌కోట్ పిచ్?పై టీమిండియా నలుగురు పేసర్లతో ఆడిందని.. కానీ పర్యాటక న్యూజిలాండ్ జట్టు రాజ్ కోట్ పిచ్ పరిస్థితులను బాగా అర్థం చేసుకుందన్నారు. స్పిన్ వారి బలం కాకపోయిన న్యూజిలాండ్ ఈ మ్యాచులో ముగ్గురు స్పిన్నర్లతో ఆడిందని గుర్తు చేశారు. అసలు రెండో వన్డే కోసం ఎంపిక చేసిన జట్టు వ్యూహమేంటో తనకు అర్థం కాలేదన్నాడు. అసలు జట్టులో నితీష్ కుమార్ రెడ్డి పాత్ర ఏంటని ప్రశ్నించాడు. నితీష్ అస్సలు ఆల్ రౌండరే కాదని కైఫ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కైఫ్ వ్యాఖ్యలపై

నితీష్ అభిమానులు మండిపడుతున్నారు. కాగా, రాజ్ కోట్ వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఓటమి పాలైన విషయం తెలిసిందే. పర్యాటక న్యూజిలాండ్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో ఈ మ్యాచులో గెలిచి సిరీస్?ను 1-1 సమం చేసింది. సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డే జనవరి 17న మధ్యప్రదేశ్ లోని ఇండోర్ వేదికగా జరగనుంది.

# ఇండియా ఓపెన్‌లో ముగిసిన భారత పోరాటం.. క్వార్టర్ ఫైనల్స్‌లో స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఓటమి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఇండియా పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన మెన్స్ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ 2117, 1321, 1821తో చైనీస్ తైపీకి చెందిన వరల్డ్ 13వ ర్యాంకర్ లిన్ చున్-యీ చేతిలో ఓడిపోయాడు. గంటా 8 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్‌ను గెలిచి శుభారంభం చేశాడు. కానీ తర్వాతి రెండు గేమ్స్‌లో అనూహ్యంగా తడబడిన సేన్.. అనవసర తప్పిదాలు చేశాడు. గురువారం జరిగిన మెన్స్ డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి 25-27, 21-23, 19-21తో హీరోకి మిడోరికావా -- క్యోహీ యామాషితా (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయింది. అయితే, మూడో గేమ్‌లో ఇరు జంటలూ 15-15తో సమానంగా ఉన్నప్పుడు ఒక షాట్ ఆడే క్రమంలో సాత్విక్ నెట్‌ను తాకాడని చైర్ అంపైర్ 'ఫాల్ట్'గా ప్రకటించడం వివాదాస్పదమైంది.

**స్టేడియంలో కోతులు, పక్షులు..షట్లర్ల ఇక్కట్లు..**

ఈ టోర్నీలో కాలుష్యం, చలి వంటి వాతావరణ సమస్యలతో పాటు ఇందిరా గాంధీ ఇండోర్‌స్టేడియంలో పక్షుల రెట్టలు పడటం, కోతులు ప్రత్యక్షమవ్వడం వంటి వింత సంఘటనలు నిర్వాహకులకు పెద్ద తలనొప్పిగా మారాయి. గురువారం హెచ్ ఎస్ ప్రణయ్ మ్యాచ్ సందర్భంగా పక్షుల రెట్టలు కోర్టులో పడటం వల్ల ఆట నిలిచిపోవడంపై ఆటగాళ్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.ఇక వాయు కాలుష్యం కారణంగా శ్వాస తీసుకోవడం కష్టమవుతోందని లో కీన్ యూ వంటి ఇంటర్నేషనల్ స్టార్లు ఫిర్యాదు చేశారు. ఈ విమర్శలపై స్పందించిన ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ స్టేడియం నిర్వహణలోని లోపాలను అంగీకరిస్తూనే, భవిష్యత్తులో జరగబోయే వరల్డ్ చాంపియన్‌షిప్ నాటికి ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి మెరుగైన వాతావరణాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చింది.

# డబ్ల్యూపీఎల్: బలమైన ముంబై ఇండియన్స్ ను ఓడించిన యూపీ వారియర్స్



- ముంబై ఇండియన్స్‌పై యూపీ వారియర్స్ 22 పరుగుల తేడాతో గెలుపు
- హాఫ్ సెంచరీలతో చెలరేగిన యూపీ బ్యాటర్లు మెగ్ లానింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్
- 188 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో తడబడిన ముంబై
- అమేలియా కెర్, అమన్‌జోత్ కౌర్ పోరాడినా ఫలితం శూన్యం
- యూపీ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌తో జట్టుకు విజయం

**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 సీజన్‌లో యూపీ వారియర్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శనివారం నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 22 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్‌లో కెప్టెన్ మెగ్ లానింగ్ (70), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (61) హాఫ్ సెంచరీలతో చెలరేగగా, అనంతరం బౌలర్లు కట్టుదిట్టంగా రాణించి జట్టుకు విజయాన్ని అందించారు. ముంబై జట్టులో అమేలియా కెర్, అమన్‌జోత్ కౌర్ చివరి వరకు పోరాడినా ఫలితం లేకపోయింది.

188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్, 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఛేదనలో ముంబై టాప్ ఆర్డర్ విఫలమవడంతో 69 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో అమేలియా కెర్ (28 బంతుల్లో 49 నాటౌట్), అమన్‌జోత్ కౌర్ (24 బంతుల్లో 41) ఆరో వికెట్‌కు 83 పరుగులు జోడించి పోరాడారు. అయితే, వీరిద్దరి పోరాటం జట్టును గెలిపించడానికి సరిపోలేదు. యూపీ బౌలర్లలో శిఖా పాండే రెండు వికెట్లు తీయగా, మిగతా బౌలర్లు సమష్టిగా రాణించి విజయంలో కీలక పాత్ర పోషించారు.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ కిరణ్ నవగిరె (0) డకౌట్ అయినా, కెప్టెన్ మెగ్ లానింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీరిద్దరూ ముంబై బౌలర్లపై ఆధిపత్యం చెలాయిస్తూ రెండో వికెట్‌కు 119 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. లానింగ్ 45 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 70 పరుగులు చేయగా, లిచ్‌ఫీల్డ్ 37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 61 పరుగులు చేసింది. ముంబై బౌలర్లలో అమేలియా కెర్ మూడు వికెట్లు పడగొట్టింది.

# నాగ్ 100 కోట్లు కొట్టాలంటే..



తెలుగు సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు టాలీవుడ్ కింగ్ నాగార్జున. కెరీర్ స్టార్టింగ్ నుంచే ప్రయోగాత్మక సినిమాలు, విభిన్న పాత్రలతో తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. అయితే గత కొన్నేళ్లుగా ఆయన చేసిన సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి. నాగార్జున స్క్రీన్ ప్రెజెన్స్ ను పూర్తిగా యూజ్ చేసుకోకపోవడమే అందుకు ప్రధాన కారణమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే నాగార్జున ప్రస్తుతం తన కెరీర్ లో 100వ సినిమాను చేస్తున్నారు. కింగ్ 100 అనే వర్కింగ్ టైటిల్ తో





తెరకెక్కుతున్న ఆ చిత్రానికి తమిళ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఆ మూవీ.. యాక్షన్ ప్రధానంగా సాగుతుందని తెలుస్తోంది. సినిమాలో నాగార్జున లుక్, క్యారెక్టర్ పూర్తిగా కొత్తగా ఉంటుందని సమాచారం. కెరీర్ లో ల్యాండ్ మార్క్ మూవీ కావడంతో ప్రాజెక్ట్ పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.అదే సమయంలో నాగ్ కు రూ.100 కోట్ల హిట్ ఎప్పుడు సొంతమవుతుందోనని అంతా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటి వరకు కెరీర్ లో ఎన్నో సినిమాల్లో నటించినా.. ఆ మార్క్ అందుకోకపోవడం గమనార్హం. ఆయనతో పాటు సీనియర్ హీరోలు అయిన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ మాత్రం ఇప్పటికే పలు రూ.100 కోట్ల సినిమాలను తమ ఖాతాలో వేసుకున్నారు. దీంతో నాగార్జున అభిమానుల్లో ఈ అంశం మరింత ఆసక్తిగా మారింది.అయితే ఇప్పుడు నాగార్జునకు రూ.100 కోట్ల హిట్ రావాలంటే అనిల్ రావిపూడితో సినిమా చేయాలని అనేక మంది సినీ ప్రియులు, నెటిజన్లు, కొందరు అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచాయి. ముఖ్యంగా చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ లాంటి సీనియర్ హీరోలతో ఆయన చేసిన సినిమాలు పండగల సీజన్ లో భారీ వసూళ్లను సాధించాయి.ఇప్పటివరకు అనిల్ రావిపూడితో పని చేయని సీనియర్ హీరోల్లో నాగార్జున ఒకరే మిగిలారు. అందుకే ఆ కాంబినేషన్ వస్తే నాగ్ కెరీర్ కు ఇది సరైన టర్నింగ్ పాయింట్ అవుతుందని సినీ వర్గాలు అంటున్నాయి. ఫుల్ ఎంటర్టైనర్ అయినా, కొత్తదనం ఉన్న కథ అయినా అనిల్ రావిపూడి హ్యాండిల్ చేయగలరనే నమ్మకం ఇండస్ట్రీలో ఉంది. అంతేకాదు సీరియస్ టోన్ ను కూడా సక్సెస్ ఫుల్ గా చూపించగలరు. ఇప్పటికే భగవంత్ కేసరి మూవీతో అది నిరూపించారు.అదే సమయంలో అనిల్ సినిమాలు తక్కువ బడ్జెట్ లో వేగంగా పూర్తవుతాయి. దీంతో నాగార్జున నటుడిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా వ్యవహరించే అవకాశం ఉంటుంది. ఏదేమైనా.. నాగార్జున, అనిల్ కాంబినేషన్ లో సినిమా వస్తే, అది నాగ్ కు ఫస్ట్ రూ.100 కోట్ల హిట్ గా నిలిచే అవకాశం ఉందని ఆయన అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మరేం జరుగుతుందో.. ఆ కాంబోలో ఎప్పుడు మూవీ వస్తుందో వేచి చూడాలి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965